
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
గురువారం 8 మే 2025 | 5



అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33(బుధవారం)
కనిష్ఠం : 28

జయహో..

» ఆపరేషన్ సిందూర్‌కు హర్షామోదాలు
» ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల మాక్ డ్రిల్



తెల్లారేసరికి సంచలన వార్త.. ఆపరేషన్ సిందూర్. పహల్గాం ఉగ్రదాడితో వేదనతో ఉన్న ప్రజలకు ఉపశమనం కలిగించే సమాచారం. పాక్ ఉగ్ర చర్యలకు దెబ్బకుదెబ్బ తీసిన అద్భుతమైన సందరాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతించారు. ఉగ్రవాద మూకలతోపాటు తెర వెనుక పాకిస్తాన్ కుట్రలకూ దీంతో చెక్ పెట్టినట్టు అయిందని పలువురు వ్యాఖ్యానించారు. అలాగే బుధవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో అనేకచోట్ల మాక్ డ్రిల్ నిర్వహించారు. యుద్ధ పరిస్థితులొస్తే ఎలా రక్షణ పొందాలో కొన్నిచోట్ల ఈ మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కూడా కల్పించారు. ప్రజలెంతో ఉద్వేగంతో ఆపరేషన్ సిందూర్‌ను స్వాగతిస్తే.. అసలు సైన్యంలో పనిచేసిన యోధుల స్పందన ఎలా ఉందో తెలుసుకోవడం మరింత ఆసక్తికరం.. వారి మాటల్లోనే విందామా మరి..!

మనతో పోల్చుకోడానికి పాక్ సరిపోదు..



ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ.. ఏ దళం విషయంలో మనతో పోల్చుకోడానికి పాకిస్థాన్ సరిపోదు. మన వాయుసేనది ప్రపంచంలోనే 3వ స్థానం. 1971లో పాకిస్థాన్‌తో యుద్ధం సమయంలో నేను విధుల్లోనే ఉన్నాను. 1962, 1965లో మన వద్ద సరైన ఎయిర్‌క్రాఫ్ట్‌లు లేవు. కానీ 1971 వచ్చేసరికి సామర్థ్యం బాగా పెరిగింది. కా న్పూర్‌లోని నెం.7 వాయుసేన ఆస్పత్రిలో నా డ్యూటీ. రోజూ రైల్వే స్టేషనుకు వెళ్లి గాయా లతో ప్రత్యేక రైళ్లలో వచ్చే యుద్ధ వీరులను ఆస్పత్రికి తరలించడం నా విధి. ప్రతి రోజూ 20-40మంది వచ్చేవాళ్లు. డిఫెన్స్ యూనిఫాంలో కనబడితే జనం దేవుడిలా చూసేవారు. ఆస్పత్రికి పెద్దఎత్తున పండ్లు పంపించేవారు. ఎంత మొత్తంలో అంటే.. మా స్టోర్ అంతా వాటితో నిండిపోవడంతో ఎవరూ పండ్లు తీసుకురావద్దని నేనే పత్రికా ప్రకటన ఇచ్చాను. దక్షిణాదిన డిఫెన్స్ వాళ్లతో ఎటాచ్‌మెంట్ తక్కువగా ఉంటుంది. కానీ నార్త్‌లో ఎక్కువ.

- స్టీవెన్‌సన్ కొంకి, విశ్రాంత సీనియర్ ఎన్‌సీవో, భారత వాయుసేన

● స్టీవెన్‌సన్ 1970లో కాన్పూర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో సర్వీసులో చేరారు. తర్వాత ఏడాదికే పాక్‌తో ప్రత్యక్ష యుద్ధం వచ్చింది. అప్పుడు స్టీవెన్‌ని కాన్పూర్ ఎయిర్ ఫోర్స్ ఆస్పత్రిలో విధులు అప్పగించారు. 1985లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందారు. తర్వాత ప్రైవేటు సంస్థల్లో పనిచేసి.. ప్రస్తుతం న్యాయవాదిగా రాజమండ్రిలో ప్రాక్టీస్ చేస్తున్నారు.

'సిందూర్' మంచి నిర్ణయం



నేను భారత్-పాకిస్థాన్ బోర్డర్‌లో బీఎస్ఎఫ్ సిపాయిగా సుమారు 50 ఏళ్లకిపైగా పనిచేశా. 2021 డిసెంబర్లో రిటైర్డ్ అయ్యాను. అలాగే టెక్నికల్‌గా బాంబుల తయారీ వ్యవస్థలోనూ పనిచేశాను. అమృత్‌సర్‌ప్రాంతంలో పనిచేసిన అనుభవం ఉంది. యుద్ధం చేయాలని మాకు ఉండేది. అప్పట్లో మన దేశం శాంతిని కోరుకోవడంతో ఆ పరిస్థితి రాలేదు. యుద్ధం అంటే ఏ దేశానికైనా ఎంతో కొంత నష్టం జరుగుతుంది. అయితే ఇవాళ ప్రధాని నరేంద్ర మోదీ ఆపరేషన్ సిందూర్‌తో మంచి నిర్ణయం తీసుకున్నారు. ఇది ఎప్పుడో చేయాల్సిన పని. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి తెగింపు ప్రదర్శించలేదు. ఈ యుద్ధంలో పాల్గొనాలని ఉంది. ప్రభుత్వం అవకాశం కల్పిస్తే మా సత్తా చూపుతాం. ఇది శాంపిల్ మాత్రమే. వాస్తవానికి ఈనెల 10, 11 తేదీల్లో యుద్ధం జరుగుతుందనుకున్నాం. అయితే ముందస్తుగా పాక్ సైన్యం కదలికలు గుర్తించి ఆపరేషన్ సిందూర్ ప్రారంభించారు. ప్రస్తుతం పీవోకేలో వంద కిలోమీటర్ల మేర సైన్యం వెళ్లింది. కశ్మీర్ వంటి ప్రాంతంలో యుద్ధం చేసేందుకు భారత్ సైన్యానికి కొంచెం ఇబ్బందే. అయితే యుద్ధం ప్రకటిస్తే ఒకటిన్నర రోజులోనే పాకిస్థాన్ ఉగ్రవాద సైన్యాన్ని తుదముట్టించవచ్చు."

- మాధవరపు వీర వెంకట సత్యనారాయణమూర్తి, గొల్లపాలెం, కాజులూరు మండలం

పాక్‌కి అంత లేదు..



భారత్‌తో యుద్ధానికి దిగేంత ఆయుధ సంపత్తి, ఆర్థిక స్థితి పాకిస్థాన్ వద్ద లేవు. మనపై అక్కసుతో చైనా అటువైపు నిలబడుతోంది. కార్గిల్‌తో కలిపి ఇప్పటికి పాకిస్థాన్‌తో నాలుగుసార్లు ప్రత్యక్ష యుద్ధం జరిగింది. మనదే విజయం. తూర్పు పాకిస్థాన్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో విముక్తికోసం వారి తరపున 1971లో జరిగిన యుద్ధంలో విజయం సాధించాం. తర్వాత తూర్పు పాకిస్థాన్ బంగ్లాదేశ్‌గా అవతరించింది. దీంతో మనకు కాశ్మీర్ లేకుండా చేయాలని దుశ్చర్యలకు పాల్పడుతూనే ఉన్నారు. కానీ ఇప్పుడు జరిగింది క్షమించరాని తప్పు. పహల్గామ్ ఘటన తర్వాత బుధవారం తెల్లవారుజామున మన దేశం చేసిన ప్రెసిషన్ ఎయిర్ స్ట్రైక్స్ నిజంగా అద్భుతం. 8 ఫిగర్ గ్రిడ్ రిఫరెన్స్‌తో గైడెడ్ మిస్సైల్స్ ఉపయోగించి టార్గెట్‌ని కొట్టగలిగాం. యుద్ధం వచ్చినా ఏడాదిపాటు ఇండియన్ డిఫెన్స్ ఫోర్సెస్‌కి రేషన్ కొరత ఉండదు. కానీ పాక్ ఆ పరిస్థితుల్లో లేదు. జమ్ము నుంచి పూంచ్ వరకూ 750 కిలోమీటర్ల ఎల్‌వోసీ ఉంది. తర్వాత పూంచ్ నుంచి అంతర్జాతీయ సరిహద్దు గుజరాత్ వరకూ ఉంది. ఇంతమేర యుద్ధ సంపత్తిని మోహరించడం పాక్ తరం కాదు. అసలు పాక్ నుంచి ఒక యుద్ధ విమానం మన వైపుగా టేకాఫ్ అయినా, మిస్సైల్ వస్తున్నా వెంటనే మన రాడార్లు కనిపెట్టేస్తాయి. ఆటోమేటిక్‌గా ఇంటర్ సెప్టార్లు వెళ్లి ధ్వంసం చేసేస్తాయి. వాళ్ల క్షిపణుల వేగం కేవలం గంటకు 650 కిలోమీటర్లు, మన దగ్గర ఉన్న బ్రహ్మోస్ వేగం గంటకు 3,450 కిలోమీటర్లు. మన దగ్గర ఉన్న భూతల రాడార్ల పరిధిలోకి కరాచి, రావల్పిండి కూడా వచ్చేస్తాయి. మన క్వాడ్రాత్ క్షిపణులు 25 కిలోమీటర్లు, ఆకాశ్ 40కిలోమీటర్ల ఎత్తులో ఉన్న వాటిని కూడా ధ్వంసం చేయగలవు. మన గైడెడ్ మిసైళ్లు వెంటాడి మరీ అంతమొందిస్తాయి. పాక్ అణుబాంబులంటూ భయపెట్టాలని చూస్తోంది. వారి వద్ద అణుబాంబు ఉన్నా దానిని ప్రయోగించే వ్యవస్థ బలహీనంగా ఉంది. అణుబాంబు మన వైపుగా పైకి లేచిందంటే మన ఇంటర్‌సెప్టార్లు వెళ్లి వాళ్ల భూభాగంలోనే కూల్చే అవకాశం ఉంది. పాక్ ప్రభుత్వం ఇప్పుడు వాళ్ల భూభాగం నుంచే యుద్ధ విమానాల ద్వారా మన భూభాగంలోకి క్షిపణులు పంపవచ్చు. వాటిని మన ఇంటర్‌సెప్టార్లు పసిగట్టి క్షణాల్లో కూల్చేస్తాయి. భూతలం నుంచి మన వైపు మోర్టార్ గన్స్‌తో దాడి చేయవచ్చు. వాటిని ఎదుర్కొనే సామర్థ్యం మన వద్ద ఉంది.

- బొమ్మన సత్యనారాయణ, విశ్రాంత లెఫ్టినెంట్ కల్నల్

● సత్యనారాయణ 1988లో ఆర్మీలో చేరి 2021లో అసోంలో లెఫ్టినెంట్ కల్నల్ హోదాలో ఉద్యోగ విరమణ పొందారు. భూతలం నుంచి విమానాలపైకి ప్రయోగించే ఆయుధాల విభాగంలో ఆర్మీ ఎయిర్ డిఫెన్స్‌లో సుదీర్ఘ అనుభవం ఉంది. పాక్ బోర్డర్‌కి దగ్గరగా రాజస్థాన్‌లోని జైసల్మేర్, బార్మేర్, రాయ్‌ఘడ్ వంటి చోట్ల విధులు నిర్వర్తించారు. రాజమండ్రిలో నివాసం.

- ఆంధ్రజ్యోతి/ రాజమహేంద్రవరం, కాకినాడ

సిట్ రైట్!



స్టెల్లా నౌకలో పట్టుబడ్డ రేషన్ బియ్యం (ఫైల్)

» రేషన్ బియ్యం స్మగ్లింగ్‌పై మళ్లీ కొత్త సిట్
» ఐపీఎస్ అధికారి ఆకే రవికృష్ణ నేతృత్వంలో కొత్త బృందం
» ఎట్టకేలకు ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం
» పాత సిట్ నియమించి ఐదు నెలలు దాటినా అతీగతీలేని దర్యాప్తు
» రేషన్ మాఫియా అంతుతేల్చడంలో తీవ్ర జాప్యంతో విమర్శలు
» ఎట్టకేలకు సిట్‌ను పునర్వ్యవస్థీకరించడంతో అక్రమార్కుల్లో వణుకు
» గతేడాది నవంబరులో స్టెల్లా షిప్‌లో పట్టుబడ్డ రేషన్ బియ్యం

కాకినాడ కేంద్రంగా కొనసాగిన వందల కోట్ల రేషన్ బియ్యం మాఫియాకు మళ్లీ ముచ్చెమటలు మొదలయ్యాయి. అక్రమార్కుల అంతు తేల్చేందుకు ప్రభుత్వం నియమించిన సిట్ ఇంతకాలం అసలే మాత్రం దర్యాప్తు మొదలుపెట్టకపోవడంతో వీరంతా ఊపిరి పీల్చుకున్నారు. మళ్లీ ఇప్పుడు సిట్‌ను పునర్వ్యవస్థీకరించి కొత్త అధిపతిని నియమించడంతో వీరిలో వణుకు మొదలైంది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమార్కులు ఐదేళ్లలో భారీగా విదేశాలకు తరలించేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా రహస్య నెట్‌వర్క్ ఏర్పాటుచేసి రేషన్ బియ్యం పేదలకు ఇలా అందగానే.. అలా కిలోకు రూ.10 చెల్లించి లక్షల టన్నులు కాకినాడకు తరలించడమే పనిగా పెట్టుకున్నారు. ప్రధానంగా వైసీపీ అధికారంలో ఉన్న అయిదేళ్లలో కాకినాడ సిటీ వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కుటుంబం, ఆయన అనుచరులు బియ్యాన్ని కనివినీ ఎరుగని రీతిలో బొక్కేశారు. ప్రభుత్వం వందల కోట్లు సబ్సిడీ చెల్లించి పేదలకు ఇచ్చే బియ్యాన్ని సదరు నేత, ఆయన మనుషులు కారుచౌకగా కొట్టేసి దాన్ని సార్టెక్స్ యంత్రాల్లో పాలిష్‌చేసి ఆకర్షణీయ ప్యాకింగ్‌ల్లో ఉంచి నౌకల ద్వారా ఆఫ్రికా దేశాలకు అమ్మేసుకుని వేలకోట్లు గడించారు. చెప్పాలంటే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2019-2020లో కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి 19 లక్షల మెట్రిక్ టన్నులు, 2020-21లో 27లక్షల మెట్రిక్ టన్నులు, 2021-22లో 29లక్షల మెట్రిక్ టన్నులు, 2022-23లో 38లక్షల మెట్రిక్ టన్నులు, 2023-24లో 24లక్షల మెట్రిక్ టన్నులు తరలిపోయింది. ఇందులో రేషన్ బియ్యం సగానికిపైనే. అటు వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి, ఆయన ప్రధాన అనుచరుడు వినోద్‌అగర్వాల్‌కు చెందిన రెండు కంపెనీలు వైసీపీ ఐదేళ్లపాలనలో రూ.4,995 కోట్ల విలువైన 13.41లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం విదేశాలకు విక్రయించాయి. అయితే గతేడాది నవంబరు ఆఖరులో కాకినాడ నుంచి పశ్చిమ ఆఫ్రికా దేశానికి స్టెల్లా నౌకలో రహస్యంగా ఎగుమతికి సిద్ధం చేసిన రేషన్ బియ్యం పట్టుబడ్డంతో స్మగ్లింగ్ వ్యవహారం అధికారికంగా బయటకు వచ్చింది. దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సైతం కాకినాడకు వచ్చి స్వయంగా షిప్ వద్దకు వెళ్లారు. ఆ తర్వాత రేషన్ ఆనవాళ్ల కోసం వెదికితే కాకినాడ, చుట్టుపక్క ప్రాంతాల్లో అనేక గోదాముల్లో ఎగుమతికి సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యం పట్టుబడింది. ఈక్రమంలో రేషన్ బియ్యం స్మగ్లింగ్‌పై రాష్ట్రప్రభుత్వం గతేడాది డిసెంబరులో ఉక్కుపాదం మోపింది. అక్రమార్కులను శిక్షించే విధంగా ప్రత్యేకంగా సిట్‌ను నియమించింది. రేషన్ బియ్యం కాకినాడకు నలుమూలల నుంచి ఎలా చేరుకుంటోంది? ఎవరు తరలిస్తున్నారు? ఎక్కడి నుంచి తరలిస్తున్నారు? అక్కడి నుంచి ఏయే గోదాముల నుంచి మిల్లులకు వెళ్లి పాలిష్ చేసుకుని ఏయే కంపెనీల ద్వారా నౌకల్లో విదేశాలకు తరలిపోనున్నాయనేదానిపై ఈ సిట్ బృందం దర్యాప్తు చేపడుతుందని పేర్కొంది. అలాగే దర్యాప్తులో భాగంగా నిందితులను తక్షణం అరెస్ట్ చేసే అధికారం సైతం కల్పిస్తూ ఆదేశాలు జారీచేసింది. అలాగే కాకినాడ, చుట్టుపక్కల మొత్తం అయిదు పోలీసుస్టేషన్ల పరిధిలో గతేడాది జూన్, జూలై నెలల్లో 13 రేషన్ బియ్యం స్మగ్లింగ్ కేసులు నమోదయ్యాయి. వీటన్నింటిపైనా కూలంకుషంగా దర్యాప్తు చేయాలని ఆదేశాల్లో ప్రభుత్వం పేర్కొంది. అయితే సిట్ బృందాన్ని నియమించిన నేపథ్యంలో అయిదు పోలీసుస్టేషన్ల పరిధిలోని 13 కేసులపై జిల్లా పోలీసులు సైతం లోతుగా విచారణ చేశారు. సిట్ దర్యాప్తునకు వస్తే తక్షణ నివేదిక ఇచ్చేలా వివరాలు సిద్ధం చేశారు. ప్రధానంగా కాకినాడ రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో జులై 11న రూ.26 కోట్లు, జూన్ 28న కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప స్టేషన్ పరిధిలో రూ.13.96 కోట్ల విలువైన రేషన్ బియ్యం పట్టుబడింది. ఇది లవన్ కంపెనీదిగా గుర్తించారు. కొటారి అమిత్ కుమార్ అనే వ్యాపారిని నిందితుడిగా తేల్చారు. అయితే ఇదే లవన్ కంపెనీ పశ్చిమ ఆఫ్రికాకు బియ్యం ఎగుమతి చేస్తుండగా బార్జిలో 1,060 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యంతో పట్టుబడింది. అదేరోజు కరప స్టేషన్ పరిధిలో రూ.15.31కోట్ల బియ్యం పట్టుబడింది. ఇది ద్వారంపూడి ప్రధాన అనుచరుడైన వినోద్ అగర్వాల్‌కు చెందిన సరళ ఫుడ్స్ కంపెనీ. ఇలా సిట్ దర్యాప్తు చేయనున్న ఈ 13 కేసులకు సంబంధించి మొత్తం రూ.84.87 కోట్ల విలువైన 22,947మెట్రిక్ టన్నుల బియ్యం పట్టుబడినట్టు పోలీసులు గుర్తించారు. ఇందులో ద్వారంపూడి అనుచరులే అధికంగా ఉండడంతో సదరు నేత ఏ స్థాయిలో రేషన్ మాఫియాను నడిపించారో అర్థం చేసుకోవచ్చు. అయితే క్షేత్రస్థాయిలో పక్కా ఆధారాలు భారీగా ఉండడంతో ఆయా కంపెనీలకు పోలీసులు నోటీసులు కూడా పంపించారు. అయితే సిట్ దర్యాప్తు ప్రారంభించడమే తరువాయి అనుకున్న తరుణంలో దాని అధిపతి వినీత్‌బ్రిజిలాల్ కాడెత్తేశారు. సిట్ ఛీఫ్ హోదాలో కనీసం ఒక్కసారి కూడా దీనిపై సమీక్ష చేయలేదు. దీంతో దర్యాప్తు నీరుగారిపోయింది. సదరు అధికారి ఉన్నట్టుండి ఈ బాధ్యతల నుంచి తప్పుకుని కేంద్ర సర్వీసులకు డిప్యూటేషన్‌పై వెళ్లిపోయారు. ఇలా ఐదునెలలపాటు విచారణ పక్కకుపోవడంతో రేషన్ స్మగ్లింగ్‌పై విచారణ ఉత్తుత్తే అనే విమర్శలు వ్యక్తమయ్యాయి.

మళ్లీ ఇంతకాలానికి కొరఢా...

వాస్తవానికి తొలుత సిట్‌ను నియమించిన తర్వాత అందులో ఉన్న కొందరు సభ్యులు గత వైసీపీ ప్రభుత్వానికి అడ్డంగా కొమ్ముకాసినవారనే విమర్శలు వచ్చాయి. దీంతో వీరిని మార్చి ప్రభుత్వం డిసెంబరు 27న మరో కొత్త సిట్‌ను నియమించింది. అందులో కొందరు పోలీసులను తప్పించి కాకినాడ జిల్లా బీసీ కార్పొరేషన్ అధికారి శ్రీనివాస్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పౌరసరఫరాల సంస్థ డీఎం బాలసరస్వతిని నియమించారు. ఇక సిట్ దర్యాప్తు స్పీడ్ అందుకుంటుందని భావిస్తున్న తరుణంలో బ్రిజిలాల్ ధోరణితో అంతా మొదటికి వచ్చింది. ఇప్పుడు మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం పాత సిట్‌ను పునర్వ్యవస్థీకరించింది. కొత్త బాస్‌గా ఐపీఎస్ అధికారి ఆకే రవికృష్ణను నియమిస్తూ ఆదేశాలిచ్చింది. సిట్ సభ్యులుగా సీఐడీ ఎస్పీ అయిన ఐపీఎస్ అధికారి బి.ఉమామహేశ్వర్, కాకినాడ బీసీ వెల్ఫేర్ ఈడీ ఏ.శ్రీనివాసరావు, కర్నూలు ఐసీడీఎస్ ఆర్జేడీ పి.రోహిణి, విజయనగరం డీఎస్‌వో కె.మధుసూదనరావు, కోనసీమ జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ఎం.బాలసరస్వతిని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలిచ్చింది.

సత్యదేవుడు పెండ్లి కొడుకాయనే..

» అన్నవరంలో ఘనంగా ప్రారంభమైన స్వామివారి దివ్యకల్యాణోత్సవాలు
» నేడు రాత్రికి అంగరంగ వైభవంగా జరగనున్న స్వామివారి కల్యాణం

6



సత్యదేవుడు, అనంతలక్ష్మిఅమ్మవారు

చమురు సంస్థల వద్ద పటిష్ట రక్షణ చర్యలు చేపట్టండి

» కంపెనీల ప్రతినిధులకు కలెక్టర్ ఆదేశం
» మాక్‌డ్రిల్‌పై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు

అమలాపురం, మే 7(ఆంధ్రజ్యోతి): పాక్‌లోని ఉగ్రస్థావరాలపై ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో దాడులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చమురు, సహజ వాయువుల నిక్షేపాలను వెలికి తీస్తున్న బేస్ కాంప్లెక్స్‌లు, చమురు నిల్వలు, గ్యాస్‌పైపులు ఉన్నప్రాంతాల భద్రతకు పరిసర గ్రామాల ప్రజల భాగస్వామ్యంతో రక్షణపరంగా మాక్‌డ్రిల్ నిర్వహించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు.చమురు సంస్థల ప్రతినిధులు, భద్రతాపరమైన అధికారులతో ఆయన సమీక్షించారు. ఓఎన్జీసీ, వేదాంత, గెయిల్ పైపులైన్ల భద్రత, రక్షణ చర్యలకు సంబంధించి మాక్‌డ్రిల్‌పై సమీక్షించారు. బేస్ కాంప్లెక్స్‌ల్లో మాక్‌డ్రిల్, సివిల్, మెరైన్ పోలీసులు, విపత్తుల నిర్వహణ బలగాలతోపాటు ప్రజల భాగస్వామ్యంతో అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. ఎస్పీ కృష్ణారావు, ఆర్డీవోలు శ్రీకర్, మాధవి, అఖిల, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి మధుసూదనరావు, జిల్లా పరిశ్రమల మేనేజర్ ప్రసాద్, చమురు, బేస్ కాంప్లెక్సుల ఇంజనీర్లు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేర పరిశోధనకు శిక్షకులు సూచనలు పాటించండి

» పోలీసు అధికారులకు ఎస్పీ సూచన



శిక్షణలో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం, మే 7(ఆంధ్రజ్యోతి): నేర పరిశోధనలో మరింత మెరుగ్గా పనిచేసి మంచి ఫలితాలు సాధించేందుకు ఏపీ ఫోర్సెనిక్ సైన్స్ లేబొరేటరీకి చెందిన శిక్షకులు ఇచ్చే శిక్షణ ఎంతోప్రయోజనకరంగా ఉంటుందని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు అన్నారు. అమలాపురంలోని కిమ్స్ కళాశాల కాన్ఫరెన్స్ హాలులో బుధవారం నేరపరిశోధనలో కీలక అంశాలపై పోలీసు అధికారులకు శిక్షకులు ఇచ్చే శిక్షణకార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.నేటి ఆధునిక టెక్నాలజీలతో నేరాలు విస్తృతంగా చేస్తున్నారని, వీటిని పరిశోధించి కీలక వ్యక్తులను గుర్తించేందుకు ఫోరెన్సిక్ నిపుణులు ఇచ్చే శిక్షణ ప్రయోజనకరంగా ఉంటుందని, దీన్ని అధికారులంతా సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భాగంగా ఏపీఎఫ్ఎస్ఎల్ టీమ్‌వారు నేర పరిశోధనలో భాగంగా శాంపిల్స్, క్లూస్ సేకరణలో వాటిని ఎఫ్ఎస్ఎల్, ఏఎఫ్ఎస్ఎల్‌కు పంపించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి కేసులో శాంపిల్స్ సేకరించినవి సరైన రీతిలో పంపడంవల్ల కచ్చితమైన రిపోర్టును పొందవచ్చునన్నారు. శిక్షణలోజిల్లా పరిధిలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఏపీపీలు, వైద్యులు పాల్గొన్నారు.

సముద్రపు నాచు ఉత్పత్తికి పైలెట్ ప్రాజెక్టు అమలుకు రంగం సిద్ధం

» తీరప్రాంతంలో రెండురోజులపాటు శాస్త్రవేత్తల బృందం అధ్యయనం
» శాస్త్రవేత్తలతో భేటీ అయిన కలెక్టర్ మహేష్‌కుమార్



శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న మహేష్‌కుమార్

అమలాపురం, మే 7(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత ప్రజల ఆదాయాన్ని పెంచేందుకు పర్యావరణ అనుకూలమైన ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో జిల్లాలో సముద్రపు నాచు సాగును(సీ వీడ్ ఫార్మింగ్) పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టేందుకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ విభాగాల సమన్వయంతో నిపుణులతో సమావేశాలు నిర్వహించి ప్రాజెక్టు రూపకల్పనకు ముందడుగు వేస్తున్నారు. దీనిలోభాగంగా బుధవారం అమలాపురంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ మహేష్‌కుమార్ అధ్యక్షతన ఓ కీలక సమావేశం జరిగింది. తమిళనాడు రాష్ట్రం మండపంలోని సీఎస్ఐఆర్, సీఎస్ఎంసీఆర్ఐలో శాస్త్రవేత్తలుగా పనిచేస్తున్న సముద్రపు నాచు జాతుల్లో అనుభవంఉన్న డాక్టర్ సతీష్, జిల్లా మత్స్యశాఖ, అటవీశాఖ, రెవెన్యూశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. సముద్రపు నాచు పెంపకంపై రైతులకు అవగాహన కల్పించడానికి తీరం వెంబడి అనువైన ప్రాంతాలను ఎంపిక చేసేందుకు రెండురోజులపాటు శాస్త్రవేత్తల బృందాలు అధ్యయన పర్యటన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కాట్రేనికోన మండలంలో స్థల పరిశీలనకు ఈ బృందం వెళ్లింది. మే 8న ఈ బృందం కలెక్టర్‌కు అధ్యయన నివేదికను అందిస్తారు. సముద్రపు నాచు జాతులు కప్ప ఫైకస్ అల్వారెజీ, గ్రాసిలేరియా ఎడ్యూలిస్ వంటి వాటిని ఉత్పత్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రాజెక్టుకు గ్రీన్ క్లమైట్ ఫండ్, నాబార్డు నిధులు సమకూరుస్తాయన్నారు. కోనసీమ తీర ప్రాంతం సముద్రపు నాచు ఉత్పత్తికి ఎంతో అనువైన ప్రాంతం కావడంతో పైలెట్ ప్రాజెక్టుగా ఇక్కడ ఎంపిక చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కలెక్టర్ సమావేశంతోపాటు ఫీల్డ్ విజిట్‌లో శాస్త్రవేత్త ఎల్.సతీష్, ఆర్డీవో కె.మాధవి, ఫిషరీస్ అధికారి పీవీ శ్రీనివాసరావు, డీఆర్డీఏ పీడీ నాగేశ్వరరావు, కాకినాడ మత్స్యశాఖ ట్రైనింగ్ కేంద్రం ప్రిన్సిపాల్ చంద్రశేఖరరెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి ఎంవీ ప్రసాదరావు, నాబార్డు జీఎం స్వామినాయుడు, వ్యవసాయాధికారి బోసుబాబు, గ్రీన్ క్లమేట్ ఫండ్ ప్రతినిధి శ్రీహర్ష పాల్గొన్నారు.

ఉద్యోగుల్లో నైపుణ్యత పెంచేందుకే క్విజ్ పోటీలు: జేసీ



రెవెన్యూ ఉద్యోగులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న జేసీ, ఆర్డీవోలు.. పోటీల్లో పాల్గొన్న ఉద్యోగులు

అమలాపురం టౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏ జిల్లాలో చేపట్టని విధంగా వినూత్న రీతిలో ఉద్యోగుల్లో సామర్థ్యాలను పెంపొందించేందుకు క్విజ్‌లు నిర్వహిస్తున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. కలెక్టరేట్‌లోని గోదావరిభవన్‌లో రెవెన్యూ, సర్వే ఉద్యోగులకు రౌండ్ టేబుళ్ల వారీగా మండలానికి 8మందిని ఎంపిక చేసిన ఉద్యోగులతో 22 టేబుళ్లు ఏర్పాటు చేసిన మూడు రౌండ్ల క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగుల్లో నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఇవి ఉపయుక్తంగా ఉంటాయని ఆమె పేర్కొన్నారు. రెవెన్యూ ఉద్యోగులు విధి నిర్వహణలో సమర్థవంతంగా సేవలు అందించేందుకు ఇవి ఉపయోగపడతాయన్నారు. 22 టేబుళ్లకు ఒక్కొక్క రౌండ్‌లో పది ప్రశ్నలు వేసి సమాధానాలు కోరారు. ఆయా టేబుళ్లనుంచి సరైన సమాధానాలు రాని పక్షంలో ఆడియన్ పోల్ ద్వారా సమాధానాలు రాబట్టారు. జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి, ఆర్డీవోలు పి.శ్రీకర్, కె.మాధవి, డి.అఖిల, డీఎస్వో ఎ.ఉదయభాస్కర్, ఏవో కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.



సత్యదేవుడు పెండ్లి కొడుకైన వేళ ప్రకృతి పులకించింది. రత్నగిరి పరిమళ సుగంధంతో శోభిల్లింది. సత్యదేవుడి సాప్తాహ్నిక దివ్య కల్యాణ మహోత్సవాల్లో తొలి రోజైన బుధవారం సత్యదేవుడు, దేవేరి అనంత లక్ష్మి అమ్మవారిని పెండ్లి కొడుకు, పెండ్లి కుమార్తె చేసే కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది.

- ఘనంగా ప్రారంభమైన సత్యదేవుని దివ్య కల్యాణోత్సవాలు
- వెండి ఆంజనేయ వాహనంపై క్షేత్ర పాలకులకు గ్రామోత్సవం
- హాస్యోక్తులతో సాగిన ఎదుర్కోలు ఉత్సవం

సత్యదేవుడు పెండ్లి కొడుకాయెనే

అన్నవరం, మే 7 (ఆంధ్రజ్యోతి): పిలిస్తే పలికే దైవంగా పూజలందుకుంటున్న అన్నవరం సత్యదేవుడి శ్రీవిశ్వావసు నామ సంవత్సర దివ్య కల్యాణ మహోత్సవాలు బుధవారం సాయంత్రం 4.30 గంటలకు అనివేటి మండపంలో విఘ్నేశ్వర పూజతో ప్రారంభమయ్యాయి. తొలుత వివిధ సుగంధభరిత పుష్పమాలికలతో సర్వాంగసుందరంగా అలంకరించిన ప్రత్యేక వేదికపై నవ వధూవరులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను, మరో వేదికపై పెండ్లి పెద్దలైన సీతారాములను ఆశీనులు గావించి ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి నరసింహమూర్తి ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనం అనంతరం ఉల్లూకల గౌరీ పూజ జరిపారు. చతుర్వేదపండితులు మహదాశీర్వచనం అందించిన తర్వాత ముత్తైదువులు పసుపు దంచారు. స్వామి, అమ్మవార్లకు దివ్యాభరణాలు ధరింపచేసి నుదుట తిలకం, బుగ్గన చుక్కతో అలంకరించారు. కార్యక్రమంలో ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పాల్గొన్నారు. వైదిక కార్యక్రమాలను చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి తదితరులు నిర్వహించారు. చతుర్వేద పండితుల వేద స్వస్తితో తొలి రోజు తంతు ముగిసింది.



ఉల్లూకల గౌరీ పూజ



బుధవారం రాత్రి గ్రామోత్సవంలో వెండి ఆంజనేయ వాహనంపై సీతారాములను ఊరేగించారు. ఆదివారం జరిగే స్వామివారి కల్యాణానికి గ్రామస్థులను సీతారాములు ఆహ్వానించేందుకు ప్రతీకగా దీనిని నిర్వంచారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.



పుసుపు దంచుతున్న ముత్తయిదువులు

బుధవారం రాత్రి ఏడు గంటలకు రాజరామరాయ కళామందిరంలో నిర్వహించిన ఎదుర్కోలు ఉత్సవం ఆద్యంతం హాస్యోక్తులతో సాగింది. స్వామివారి తరఫున చైర్మన్ ఐవీ రోహిత్, కొందరు పండితులు అమ్మవారి తరపున ఈవో వీర్ల సుబ్బారావు మరికొందరు పండితులు... స్వామి, అమ్మవార్ల కీర్తిప్రతిష్ఠలు, గుణగణాలు, వంశకీర్తిలను చలోక్తలతో వివరించారు. అనంతరం ఒకరినొకరు లగ్నపత్రికలు మార్చుకుంటూ కల్యాణ శుభ ఘడియలను పండితుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.



ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

నేటి రాత్రి కల్యాణం

సత్యదేవుడి వార్షిక దివ్య కల్యాణాన్ని గురువారం రాత్రి 9 గంటలకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. సుమారు 40 అడుగుల వెడల్పుతో వివిధ పుష్పమాలికలు, విద్యుద్దీపాలతో కల్యాణ వేదికను శోభాయమానంగా తీర్చిదిద్దారు. సుమారు 25వేల మంది భక్తులు విచ్చేస్తారన్న అంచనాతో అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఆర్ఎంసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ విష్ణువర్ధన్ బాధ్యతల స్వీకారం



బాధ్యతలు చేపడుతున్న డాక్టర్ విష్ణువర్ధన్

జీజీహెచ్ (కాకినాడ), మే 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన తన లక్ష్యాలను మీడియాకు వివరించారు. విద్యార్థులు, అధ్యాపకుల మధ్య సహృద్భావ వాతావరణాన్ని పెంపొందిస్తానన్నారు. క్రీడలు, యోగా ప్రాధాన్యతను విద్యతో పాటు తెలియజేస్తానన్నారు. ఆర్ఎంసీ ప్రాంగణంలో డ్రైనేజీ సిస్టమ్‌ను మెరుగుపరుస్తానని, కొత్తగా పరిపాలనా విభాగం నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. యూజీ, పీజీ బాయ్స్, గర్ల్స్ హాస్టళ్ల నిర్మాణం పూర్తయ్యేలా చూస్తానన్నారు. యాంటీ ర్యాగింగ్ చర్యలను కఠినతరం చేయడంతో పాటు ప్రతిభ కనబర్చిన పేద విద్యార్థులకు నాణ్యమైన వసతి సమకూర్చడానికి కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం పెండింగులో ఉన్న పనులను పూర్తి చేయడం, అడిషనల్ ఎగ్జామినేషన్ హాల్స్‌కు ఎయిర్ కండిషన్స్ ఏర్పాటు చేయడం, నర్సింగ్ హాస్టల్స్ నిర్మాణం, విద్యార్థుల అటెండెన్స్‌ను ఇంప్రూవ్ చేయడం, పరీక్షలను పారదర్శకంగా నిర్వహించడం చేస్తానన్నారు. ఆడిటోరియం పనులను పూర్తి చేయించడంతో పాటు ఆర్ఎంసీ ప్రాంగణంలో పచ్చదనం పెంపొందించేలా గార్డెనింగ్‌ను అభివృద్ధి చేస్తానన్నారు. కాలేజీ క్యాంటీన్‌ను అభివృద్ధి చేసి అందులో మోడ్రన్ కిచెన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు చేపడతానని డాక్టర్ విష్ణువర్ధన్ చెప్పారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ విజయశేఖర్

ప్రాణాపాయ తీవ్రత తగ్గించడంలో అంబులెన్స్ సిబ్బంది పాత్ర కీలకం

ట్రామాటిక్ బ్రెయిన్ ఇంజూరీ (టీబీఐ)పై అవగాహన సదస్సులో డాక్టర్ విజయశేఖర్

జీజీహెచ్ (కాకినాడ), మే 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్, న్యూరో సర్జరీ సెమినార్ హాల్లో బుధవారం ట్రామాటిక్ బ్రెయిన్ ఇంజూరీ (టీబీఐ)పై అవగాహన సదస్సు నిర్వహించారు. న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ఎంవీ విజయశేఖర్, ప్రొఫెసర్ డాక్టర్ కోదండగిరి రావు ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు ముఖ్య అతిథులుగా ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్, గౌరవ అతిథిగా డాక్టర్ కె.బాబ్జీ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయశేఖర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి ప్రాణాపాయ తీవ్రత తగ్గించడంలో అంబులెన్స్ సిబ్బంది పాత్ర కీలకమన్నారు. ఆసుపత్రికి వచ్చిన క్షతగాత్రుడికి గోల్డెన్ అవర్‌లో వైద్యులు అందించాల్సిన వైద్య సేవలపట్ల అత్యవసర విభాగం వైద్యులకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలపై పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలు, లారీ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లకు పోలీస్, రవాణా శాఖలతో వైద్యులు సమన్వయం చేసుకుంటూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తామన్నారు. ఆసుపత్రిలో వైద్య సేవల అనంతరం డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్లిన వారికి తప్పనిసరిగా ఫిజియోథెరపీ అవసరముంటుందన్నారు. సదస్సులో క్యాజువాలిటీ విభాగాధిపతి డాక్టర్ సత్యవాణి, డాక్టర్ శివకుమార్, ఏఆర్ఎంవో డాక్టర్ లావణ్య, సీఎంవో డాక్టర్ అరీఫానస్రిన్, డాక్టర్ రష్మిత, డాక్టర్ లక్ష్మి కీర్తి, డాక్టర్ సుష్మ, డాక్టర్ సుందరచంద్ర, డాక్టర్ ఎడ్వర్డ్, డాక్టర్ భానుహరీష్, పీజీ వైద్యులు, అంబులెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.



గతంలో నేలకోట నుంచి మోతుగూడెం ఆసుపత్రికి తీసుకొస్తున్న దృశ్యం(ఫైల్)

నేలకోట వంతెన నిర్మాణం కలేనా ?



నేలకోట గ్రామం నుంచి మోతుగూడెం రహదారిని వంతెనను పరిశీలిస్తున్న చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్(ఫైల్)

- ఏళ్లు గడుస్తున్నా కానరాని అభివృద్ధి
- రవాణా సౌకర్యం లేక పడరాని పాట్లు
- ఆసుపత్రికి వెళ్లాలంటే డోలి కట్టాల్సిందే
- వర్షాకాలంలో గిరిజనుల నరకయాతన
- హామీలతో కాలం వెళ్లదీస్తున్న నాయకులు

మోతుగూడెం, మే 7 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు గడుస్తున్న ఇంకా ఏజెన్సీలో పలు గ్రామాలకు రవాణా సౌకర్యం లేదంటే ఆశ్చర్యం కలుగుతోంది. గిరిజన ప్రాంతాల్లో రోడ్లు లేక గిరిజనులు నేటికీ కాలినడకనే మండల కేంద్రాలకు చేరుకునే దుస్థితి నెలకొంది. వాగులు, వంకలు దాటి బయటకు రావాలంటే గిరిజనులు పడే కష్టాలు అన్నీఇన్నీ కావు. గిరిజనుల సమస్యలను ప్రజాప్రతి నిధులు అధికారులు, ప్రభుత్వాలుకానీ పట్టించుకోవడం లేదు. వర్షాకాలంలో గిరిజనులు బాధలు వర్ణణాతీతం. రోగం వచ్చి నా, ఏదైనా అత్యవసర పనులు పడినా బయట ప్రపం చానికి రావాలంటే నరకమే. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో అలాంటి గ్రామాలు నేటికీ ఉన్నాయం టే ఆశ్చర్యం వేయకమానదు. విభజనకు ముందు, విభజన తర్వాత చింతూరులో కొత్తగా గిరిజనుల అభివృద్ధి కోసం ఏర్పాటుచేసిన ఐటీడీఏ ఇక్కడ ప్రజలను పట్టించుకోవడంలేదని విమర్శలు ఉన్నాయి. చింతూరు మండలం కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని నేలకోట గ్రామస్థులు మోతుగూడెం రావాలంటే నేటికీ రవాణా మార్గంలేదు. వాగులుదాటి రాళ్ల దారిలోనే కష్టాలు పడుతూ రావాలి. వర్షాకాలంలో వాగులు పొంగితే ఈ గ్రామస్థులు బయట ప్రపంచానికి రావడం కష్టమే. ఆ సమయంలో ఏదైనా ఆపద వస్తే ప్రాణాలు గాలికి పోవాల్సిందే. ఈ ప్రాంతంలో ఉన్న చిన్న చిన్న వాగులపై వంతెనలు నిర్మిస్తే ఈ ప్రాంతాల్లోని వారికి రవాణా మార్గం సులభం అవుతుంది. ఎన్నికల అప్పుడు ప్రజాప్రతినిధులు వచ్చి వంతెన నిర్మిస్తామని హామీలు ఇస్తున్నా కార్యరూపం దాల్చడం లేదు. ఈ ప్రాంతం గిరిజనులు ఇంకా వెనుకబాటుతనంగా ఉంటున్నారు. గర్భిణులు అనారోగ్యంగా ఉంటే ఆ గ్రామానికి నేలకోట నుంచి మోతుగూడెం రావడానికి రవాణా సౌకర్యంలేదు. మోతు గూడెం నుంచి నేలకోట ఆరు కిలోమీటర్లు. నేలకోట నుంచి దబ్బ గూడెం ప్రాథమిక ఆసుపత్రికి చుట్టూ తిరిగి వెళితే 15 కిలోమీటర్లు వస్తోంది. మెరుగైన వైద్యం కోసం మండల కేంద్రానికి చింతూరు వెళ్లాలంటే 30కిలోమీటర్లు వెళ్లాలి. నేలకోటకు మోతు గూడెంకు వంతెన నిర్మిస్తే వైద్య సౌకర్యం, నిత్యావసర సరుకులు దగ్గరగా ఉంటుందని గ్రామస్థులు చెబుతున్నారు. గతంలో గర్భిణులు అనారోగ్యంగా ఉంటే గ్రామానికి వాహనాలు వచ్చే అవకాశం లేదు. దీంతో గ్రామస్థులు నేలకోట నుంచి మోతుగూడెం ప్రాథమిక ఆసుపత్రికి మంచంపై జట్టీలు కట్టి మోసుకొని తీసుకువెళతారు. ప్రజలు నిత్యావసర సరుకులు తెచ్చుకోవాలన్నా వాగులు, అడవులు దాటి రావాల్సిందే. ఇప్పటికైనా అధికారులు స్పందించి చింతూరు మండలంలో రోడ్డు మార్గంలేని గ్రామాలకు రోడ్లు సౌకర్యం కల్పించాలని, వాగుపై వంతెనలు నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు.

నేలకోట గ్రామాన్ని సందర్శించిన పీవో

నేలకోట గ్రామస్తులు రెండు నెలల క్రితం చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌ను కలిసి నేలకోట నుంచి మోతుగూడెం రహదారి బ్రిడ్జి వేయాలని ఐటీడీఏ పీవో వినతి పత్రం అంద జేశారు. స్పందించిన ఐటీడీఏ పీవో నేలకోట రహదారి మార్గాన్ని పరిశీలిస్తూ నేలకోట అడవి మార్గం ద్వారా మోతుగూడెం వరకు నడుచుకుంటూ వచ్చారు. సమస్యపై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఐటీడీఏ పీవో తెలిపారు. వచ్చేది వర్షాకాలం దయవుంచి సంబంధిత అధికారులు స్పందించి మాకు వంతెన నిర్మాణం పనులు చేయాలని నేలకోట గ్రామస్తులందరూ కోరుతున్నారు.



గోదావరి గట్టుపై రివర్ ఫ్రంట్ వ్యూ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసు, ఎమ్మెల్సీ వీర్రాజు, కలెక్టర్ ప్రశాంతి

సుందర నగరంగా రాజమహేంద్రి

- పక్కా ప్రణాళికతో ముందుకు : కలెక్టర్ ప్రశాంతి
- రిఫర్ ఫ్రంట్ అభివృద్ధి ఓ మైలురాయి : ఎమ్మెల్యే ఆదిరెడ్డి
- హాజరైన ఎమ్మెల్యే బత్తుల, ఎమ్మెల్సీ సోము

రాజమహేంద్రవరం, మే 7(ఆంధ్రజ్యోతి) : గోదావరి నదీ తీరాన ఉన్న రాజమహేంద్రవరం నగరాన్ని సుందరంగా, ఆహ్లాదంగా తీర్చిదిద్దడానికి పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని తూర్పుగోదావరిజిల్లా కలెక్టర్ ప్రశాంతి అన్నారు. పుష్కర సమయంలో ప్రతిరోజూ 10 లక్షలమంది ఈ ప్రాంతానికి వస్తారని అంచనా వేస్తున్నామని ఆమె చెప్పారు. కలెక్టర్ ప్రశాంతి, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రూ.8 కోట్లతో చేయనున్న రివర్ ఫ్రంట్ అప్పర్ ప్రొమినెడ్ అభివృద్ధి పనులకు గోదావరి గట్టున ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద బుధవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణచౌదరి, రాజమహేంద్రవరం మునిసిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొని తొలుతగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి, గ్యాలరీలోని నమూనా ఫొటోలను తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ గత పుష్కరాలకు కేవలం ఘాట్లను మాత్రమే అభివృద్ధి చేసుకున్నామని, ఇప్పుడు అన్నివిధాలా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. అఖండ గోదావరి ప్రాజెక్టు కింద కేంద్ర పర్యాటకశాఖ ద్వారా రూ.100 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధుల్లో రూ.97 కోట్లు రాజమహేంద్రవరానికే కేటాయించడం జరిగిందన్నారు. రానున్న ఆరునెలల్లో నగరంలోని 22 పార్కులను పూర్తి స్థాయిలో అభివృద్ధిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అయితే.. అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నా.. వాటిని పరిరక్షించే బాధ్యత మాత్రం నగర పౌరులదేనని ఆమె పేర్కొన్నారు. రోడ్లు, పార్కులు వంటివి నిరంతరం పరిశుభ్రంగా ఉంచడంలో వారు కీలక బాధ్యత పోషించాలన్నారు. 2027 నాటికి నగరాన్ని ఇండోర్ నగరానికి మించి సుందరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ సాంస్కృతిక రాజధానిగా ఉన్న రాజమహేంద్రవరాన్ని టూరిజం హబ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని, రివర్ ఫ్రంట్ అభివృద్ధి అనేది నగర ప్రజల 15 ఏళ్ల కలని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఎంపీ పురందేశ్వరితో కలిసి ఈ ప్రాంతంలో ప్రచారం సమయంలో రాజమహేంద్రవరాన్ని టూరిజంహబ్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చామన్నారు. లోయర్ ప్రొమినెడ్ పనులు రూ.14 కోట్లతో త్వరలోనే ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రస్తుతం గోదావరి గట్టుపై ఉన్న ప్రముఖుల విగ్రహాలను తొలగిస్తున్నామని వైసీపీ అప్పుడే తప్పుడు ప్రచారం మొదలు పెట్టిందని విమర్శించారు. ఆ విగ్రహాలను తొలగించబోమని, మరింత శోభ తీసుకొచ్చే విధంగా ఏర్పాటుచేస్తామన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ ఈ ప్రాంతాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయ డానికి పుష్కరాలు ఓ వేదికని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు సమీకరించి మరింత అభివృద్ధి దిశగా అడుగులు వేద్దామ న్నారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో రాజమహేంద్రవరం ప్రజలు పెనుమార్పులను చూడబోతున్నారన్నారు. రివర్ ఫ్రంట్ అప్పర్ ప్రొమినెడ్‌తో పాటు.. దిగువన వేమగిరి నుంచి బొబ్బర్లంక వరకూ గోదావరి గట్టును అభివృద్ధి చేయడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేస్తున్నారని ఆయన చెప్పారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ఓవైపు గోదావరినది, మరోవైపు మన్యం, కోనసీమ అందాలు ఈ ప్రాంత పర్యాటకానికి దోహదప డుతున్నాయన్నారు. మునిసిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ గత పది నెలల కాలంలో నగరంలో రూ.220 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వీటిలో రూ.128కోట్ల పుష్కరాల పనులు ఉన్నాయన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకూ రూ.29 కోట్లతో పనులు మొదలు పెట్టామన్నారు. చివరి కాలనీ వరకూ రూ.కోటితో వీధి లైట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తొలి దశలో మూడు జంక్షన్ల అభివృద్ధి జరుగుతుందన్నారు. పన్నుల వసూళ్లలో రాజమహేంద్రవరాన్ని ఏపీలోనే మొదటి స్థానంలో నిలిపినందుకు ప్రజలకు కృతజ్ఞతలు చెబుతు న్నామన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు చల్లా శంకర్రావు, గన్నికృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశానికి సర్టిఫికెట్ల ధ్రువీకరణ

కార్పొరేషన్ (కాకినాడ), మే 7(ఆంధ్ర జ్యోతి): కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో 2025-26 సంవత్సరానికి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సమీపంలోని ఏదైనా ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ, లేదా జిల్లా ఉపాధి కార్యాలయం అమలాపురంలో ఏర్పాటుచేసిన వెరిఫికేషన్ కేంద్రంలో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఆన్‌లైన్ నమోదు పత్రంతో హాజరై ఈనెల 26న సాయంత్రం 5 గంటలలోపు సర్టిఫికెట్స్ ధ్రువీకరించుకోవాలని తెలిపారు. వెరిఫికేషన్ చేయించుకొని వారి అడ్మిషన్ పొందడానికి అనర్హులు అవుతారన్నారు. కాకినాడ, కోనసీమజిల్లాలో గల ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో అడ్మిషన్ పొందలేరని, కాకినాడ, కోనసీమ జిల్లాల అడ్మిషన్స్ కన్వీనర్, కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపా ల్ వర్మ తెలిపారు. దరఖాస్తు చేసుకునేటప్పుడు ఏవైనా సందేహాలు వస్తే 0884-2348 182, 9440408182లో సంప్రదించాలన్నారు.

మన్యంలో మళ్లీ మావోయిస్టుల అలజడి

- తీగలమెట్ట ఎన్‌కౌంటర్ అనంతరం కానరాని కదలికలు
- ఛత్తీస్‌గఢ్ ఏరివేత నేపథ్యంలో ఐదేళ్ల తర్వాత ఇటు తరలుతున్న దళాలు

(ఆంధ్రజ్యోతి-రంపచోడవరం)

గత ఐదేళ్లుగా ఎటువంటి మావోయిస్టుల కదలికలు లేకుండా ప్రశాంతంగా ఉన్న రంప మన్యంలో మళ్లీ మావోయిస్టుల అలజడి మొదలైంది. రంపచోడవరం డివిజన్‌కు సరిహద్దుల్లో విశాఖ జిల్లా రూరల్ కొయ్యూరు మండలం మంప పోలీసుస్టేషన్ పరిధిలో 2021 సెప్టెంబర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్ అనంతరం ఏవోబీలోనే మావోయిస్టుల నిష్క్రమణ ప్రారంభమైంది. తదనంతరం రంపచోడవరం డివిజన్లో పూర్తిగా మావోయిస్టులు కదలికలు లేకుండా పోయాయి. 2024చివర్లో నుంచి మళ్లీ మావోయిస్టుల కదలికలు ఇటుగా మళ్లుతూ వచ్చాయి. ఎప్పటికప్పుడు సమగ్రమైన నిఘా సమాచారంతో మావోయిస్టుల కట్టడికి పోలీసు యంత్రాంగం చేపట్టిన చర్యలు వారిని నిలువరిస్తూ వచ్చాయి. అయితే ఇటీవలకాలంలో మావోలకు ఎంతో పట్టుఉన్న ఛత్తీస్‌గఢ్, దానికి సరిహద్దుగా ఉన్న ఒడిశాలోని మల్కన్‌గిరి ప్రాంతాల్లో వారి ఉనికే ప్రశ్నార్థకంగా మారడంతో క్రమేణా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లే దిశగా మావోయిస్టులు వ్యవహరిస్తూ వచ్చారు. ముఖ్యంగా ఎంతో సురక్షితమనుకున్న ఛత్తీస్‌గఢ్ కూడా మావోయి స్టుల చేయిదాటిపో యే పరిణామాలు చోటు చేసుకోవడంతో ఆయా నేతలు వారి స్వరాష్ట్రాలకు తరలిపోయే వ్యూహాలను అనుసరించడంతో ఏవోబీలోకి మావోయిస్టులు తరలివస్తున్నారన్న సమాచారం పోలీసులకు ఉంది. దీంతో ఆయా ప్రాంతాలపై ఇప్పటికే నిఘా పెంచి గాలింపును ముమ్మరం చేశారు. గత రెండు నెలలుగా రంపచోడవరం డివిజన్లో మావోయిస్టుల కదలిక లను పోలీసులు గుర్తించారు. మారేడుమిల్లి మండలం గుడెసకొండల్లో ఈ సంవత్సరం ఫిబ్రవరి చివర్లో 90 మంది వరకూ మావో యిస్టులు సమావేశమయ్యారు. దీనిపై కేసు కూడా నమోదైంది. అనంతరం పోలీసులు మావోయిస్టుల కదలికలపై నిఘాలను పెంచి ఎక్కడికక్కడ గాలింపును ముమ్మరం చేశారు. సుమారు 10 రోజుల కిందట వై.రామవరం మండలం సరిహద్దుల్లోని విశాఖరూరల్ కొయ్యూరు పోలీసు స్టేషన్ పరిధిలో మావోయిస్టుల కదలికల నేపథ్యంలో అక్కడకు చేరుకున్న పోలీసులకు, మావోయిస్టులకు ఎదురుకాల్పులు జరిగాయి. దీంతో మావోయిస్టులు ఇక్కడకు పెద్దఎత్తున చొరబడినట్టు ధ్రువీకరించుకున్న పోలీసులు పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా బుధవారం వై.రామవరం మండలం శేషరాయి అడవుల్లో పోలీసులకు మావోయిస్టులు తారసపడడంతో ఎదురుకాల్పులు జరగడం, పలువురు మావోయిస్టులు హతమై, ఇద్దరు కీలక నేతల మృతదేహాలు లభ్యం కావడంతో మన్యంలో మళ్లీ అలజడి మొదలైనట్టయింది. ఈ ఘటనలో మృతి చెందిన వారిలో ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు జగన్, డివిజనల్ కమిటీ సభ్యుడు రమేష్‌లు ఉన్నారని పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో తెలిసింది. కాగా మరో ముఖ్య మహిళా నేత అనిత తప్పించుకున్నట్టు తెలుస్తోంది. అయితే మృతుల సంఖ్యపై ఇంకా స్పష్టత రాలేదు.

వానమ్మో..

బుధవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. కుండపోతగా రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు, పనులకు వెళ్లేవారు వామ్మో ఇదేం వానంటూ కంగారుపడ్డారు


కొత్తపేటలో...


కె.గంగవరంలో...



కాకినాడలో...

జేసీబీ, గోడకు మధ్యలో ఇరుక్కుని వ్యక్తి మృతి


వాసు (ఫైల్)

ఎటపాక, మే 7 (ఆంధ్రజ్యోతి): జేసీబీ సాయంతో ఇసుకను ఆన్‌లోడు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు జేసీబీ, గోడకు మధ్యలో ఇరుక్కుకుని భద్రాచలానికి చెందిన పగడాల శ్రీనివాస్‌రెడ్డి అలియాజ్ అంబికా వాసు (45) మృతిచెందాడు. ఈ ఘటన అల్లూరి జిల్లా ఎటపాక మండలం మేడివాయిలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. మేడివాయిలోని ఓ భవన నిర్మాణ పనులకు వాసు ఇసుకను తెలంగాణలోని చర్ల నుంచి తరలించాడు. అయితే ఇసుక టిప్పర్ ఇసుకను లోడ్ చేసేందుకు వస్తున్న క్రమంలో గుంతలో కూరుకుపోయింది. దీంతో వాసు జేసీబీని తీసుకొచ్చి టిప్పర్‌లోని ఇసుకను ఆన్‌లోడు చేస్తుండగా పట్టుకోల్పోయి జేసీబీ అదుపుతప్పింది. ఆ సమయంలో వెనుక గోడ పక్కన ఉన్న వాసు గోడ, జేసీబీ మధ్యలో ఇరుక్కుపోయాడు. వెంటనే అతడిని వైద్యం కోసం భద్రాచలానికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. ఈ ఘటనపై పోలీసులకు ఏఫిర్యాదు అందలేదు.

పాండవ నదిలో మహిళ మృతదేహం లభ్యం


లభ్యమైన మహిళ మృతదేహం

తుని రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని పట్టణ శివారు కత్రాలకొండ సమీపంలో పాండవ నదిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. తుని పట్టణ పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ విజయబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని బయటకు తీశారు. ప్రమాదవశాత్తు మరణమా లేక ఆత్మహత్యా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విజయబాబు తెలిపారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని కోరారు.

వడదెబ్బకు 'ఉపాధి' కూలీ మృతి


గోవిందు మృతదేహం వద్ద తోటి కూలీలు

జగ్గంపేట రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం నరేంద్రపట్నం గ్రామంలో ఉపాధి పనులు చేస్తుండగా బొబ్బరాడ గోవిందు (52) మృతిచెందినట్టు అధికారులు తెలిపారు. పనులు చేస్తుండగా అకస్మాత్తుగా స్పృహ తప్పి పడిపోవడంతో తోటి కూలీలు గట్టు మీదకు చేర్చారు. అయితే గోవిందు వడదెబ్బ తాళలేక మృతి చెందినట్టు ఉపాధి అధికారులు తెలిపారు.

మనస్తాపంతో ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

జగ్గంపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కాకినాడ జిల్లా జగ్గంపేట కమ్మవీధికి చెందిన ఇమ్మళ్ళ సత్యనారాయణ కుమారుడు గౌతమ్‌కుమార్ అలియాస్ రాజు(20) కాకినాడలో వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారం నిమిత్తం తండ్రి ఎకరం భూమి అమ్మి రూ.కోటి వరకు కొడుక్కి ఇచ్చాడు. వ్యాపారంలో నష్టంతో పాటు అతడికి రావాల్సిన సొమ్ము రాకపోవడంతో మనస్తాపానికి గురైన గౌతమ్ కుమార్ తండ్రి పొలంలోకి వెళ్లిన సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్టు జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అత్యంత అమానుషం!

కాకినాడ జిల్లా పిఠాపురంలో అత్యంత అమానవీయ, అమానుష సంఘటన జరిగింది. ముక్కుపచ్చలారని ఆరునెలల చిన్నారిని నూతిలో పడవేయడమే గాక అదే ఇంటి వద్ద క్షుద్రపూజలు చేశారు. ఈ సంఘటన తీవ్ర కలకలం సృష్టించింది.

పిఠాపురంలో ఆరు నెలల చిన్నారిని నూతిలో పడేసిన వైనం

- ఆపై క్షుద్రపూజలు
- బంధువులపైనే అనుమానాలు


నూతిలో చిన్నారి మృతదేహం


యశ్విత (ఫైల్)

పిఠాపురం, మే 7 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం నరసింగపురానికి చెందిన టైల్స్ పని చేసే పెదపాటి సతీష్‌కు పట్టణంలోని యానాదుల కాలనీకి చెందిన శైలజ ప్రేమించుకుని రెండేళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నారు. వీరికి ఆరునెలల చిన్నారి యశ్విత ఉంది. ప్రస్తుతం శైలజ పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలోని అమ్మగారి ఇంటి వద్ద ఉంటోంది. రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి ఇంటి వద్ద కింద గదిలో చిన్నారి యశ్విత, తల్లి శైలజ, అమ్మమ్మ, బంధువులు, మేడపై తాతయ్య దుర్గారావు మరొకరు నిద్రించారు. అర్ధరాత్రి ఒంటి గంట దాటిన తర్వాత పాప కనబడడం లేదని చిన్నారి తాత దుర్గారావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు, కుటుంబసభ్యులు చూడగా ఇంటి పక్కనే ఉన్న బావి(నూతి) వద్ద చిన్నారి అమ్మమ్మ సెల్‌ఫోన్ కనిపించింది. దీంతో నూతిలో వెతకగా చిన్నారి పడి ఉండటాన్ని గమనించారు. అనంతరం చిన్నారి మృతదేహాన్ని వెలికి దీశారు. అదే సమయంలో చిన్నారి ఇంటి వద్ద క్షుద్రపూజల ఆనవాళ్లు కనిపించాయి. ఇంటి బయట కుంకుమ, పసుపు, నిమ్మకాయలు ఇతర పూజా సామాగ్రి పడి ఉండటం కలకలం రేపింది. ఈ సంఘటన జరిగిన సమయంలో చిన్నారి తండ్రి సతీష్ నరసింగపురంలోని తన ఇంటి వద్ద ఉన్నాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి చిన్నారి మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అన్నీ అనుమానాలే

చిన్నారి నూతిలో పడి మరణించడం, క్షుద్రపూజల ఆనవాళ్లు కనిపించడంపై కుటుంబసభ్యులు, బంధువులు చెబుతున్న సమాధానాలు పొంతనలేకుండా ఉండటంతో పోలీసులు వారిని విచారిస్తున్నారు. తల్లి పక్కన నిద్రించిన చిన్నారిని ఎవరు తీసుకెళ్లారు, ఎవరు నూతిలో పడవేశారు, క్షుద్రపూజల సామాగ్రి అక్కడ ఎందుకు ఉంది తదితర ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చిన్నారిని నూతిలో పడవేసినట్లు అర్ధరాత్రి దాటిన త ర్వాత పడుకున్న ఇతర కుటుంబసభ్యులకు ఎలా తెలిసింది, అర్ధరాత్రే పోలీసులకు ఎలా ఫిర్యాదు చేశారు తదితర అంశాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బయట వ్యక్తులు వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయని, ఇందులో బంధువుల ప్రమేయం ఉండవచ్చనే కోణంలో విచారణ సాగిస్తున్నారు. కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పా టిల్, పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ సభ్యులు అక్కడ ఆధారాలు సేకరించారు.


కుంకుమ, పసుపు, నిమ్మకాయలు


వేదనలో చిన్నారి తల్లి శైలజ

కఠినంగా శిక్షించాలి

ముక్కుపచ్చలారని ఆరునెలల చిన్నారిని నూతిలో పడవేయడానికి ఎలా మనస్సు వచ్చిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే తెల్లవారుజాము సమయంలో ఇంటి పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు భారీగా తరలివచ్చారు. క్షుద్రపూజలు కోసం చిన్నారిని ఈ విధంగా చేసి ఉంటారని వారు అభిప్రాయపడుతున్నారు. ఇటువంటి అమానుష సంఘటనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆడుకుంటూ నూతిలో పడి ఆరేళ్ల బాలుడు దుర్మరణం

సామర్లకోటలో విషాద సంఘటన


నూతిలో నుంచి బాలుడి మృతదేహాన్ని పైకి తీసుకువచ్చిన రెస్క్యూ టీమ్


హేమంత్ (ఫైల్‌ఫొటో)

సామర్లకోట, మే 7 (ఆంధ్రజ్యోతి): ఇంటి ఎదురుగా ఖాళీస్థలంలో సరదాగా ఆడుకుంటున్న ఆరేళ్ల బాలుడు ప్రమాదవశాత్తూ సమీపంలోనే నూతిలో పడి దుర్మరణం పాలైన సంఘటన బుధవారం రాత్రి కాకినాడ జిల్లా సామర్లకోట అయోధ్యరామపురంలో జరిగింది. హేమంత్ తల్లి చావా రాధ కిరాణా షాపులో పనిచేస్తుండగా తండ్రి సతీష్ కూలీపనులు చేస్తుంటాడు. బాలుడికి అక్క కూడా ఉంది. పిల్లలిద్దరినీ తాత, అమ్మమ్మల వద్ద ఉంచి తల్లితండ్రులు రోజూ పనులకు వెళ్తుంటారు. అదే క్రమంలో బుధవారం ఇంటి వద్ద వదిలివేయడంతో సమీపాన ఉన్న ఖాళీ స్థలంలో అక్కతో కలిసి ఆడుకుంటున్నాడు హేమంత్. అక్కడే నూతి సమీపంలో గోలెం ఉండడంతో గోలెం ఎక్కి నూతిలోకి చూసే ప్రయత్నంలో ప్రమాదవశాత్తూ నూతిలోకి పడి పోయాడు. హేమంత్ అక్క సమీపంలో ఉన్న పలువురికి విషయం చెప్పింది. అలాగే ప్రమాద సమాచారాన్ని సమీపంలోనే ఉన్న టీడీపీ కార్యకర్త పెద్దాపురం అగ్నిమాపక శాఖ అధికారులకు అందించగా హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని నూతిలో పడిన బాలుడిని రక్షించేందుకు చేసిన ప్రయత్నాలు పూర్తిగా విఫలమయ్యాయి. తాళ్ల సాయంతో నూతిలోకి సిబ్బంది దిగినప్పటికీ అప్పటికే పైనుంచి సుమారు 70 అడుగుల లోతులో ఉన్న నూతిలో బాలుడు మృతి చెంది ఉండడాన్ని గుర్తించి మృతదేహాన్ని పైకి చేర్చారు. పై నుంచి కిందికిపడడంతో తలకు బలమైన గాయమై మృతిచెందినట్టు ప్రాథమికంగా గుర్తించారు. కుమారుడు మృతిచెందిన విషయం తెలిసి బాలుడి తలిదండ్రులు ఘటనా స్థలికి చేరుకున్నారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకు విగతజీవుగా మారడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

28.6 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

తొండంగి, మే 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి శివారు తమ్మయ్యపేట వద్ద అక్రమంగా తరలిస్తున్న 28.6 టన్నుల రేషన్ బియ్యాన్ని జిల్లా పౌరసరఫరా అధికారి రుద్రరాజు సత్యన్నారాయణరాజు సిబ్బందితో దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం తెల్లవారుజామున ఏపీ 39 యుడి 6507 అశోక్‌లేలాండ్ లారీలో విశాఖపట్నం పోర్టుకు అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు డీఎస్‌వో సత్యన్నారాయణరాజు, డిప్యూటీ తహశీల్దార్లు బి.రాజు, వీరాస్వామిలతో కలిసి దాడి చేశారు. నల్లజర్లకు చెందిన శ్రీవినాయక ట్రేడర్స్ మద్దు సత్యన్నారాయణ, లారీ డ్రైవర్ గొలుసు శంకర్రావు అనధికార తరలింపునకు పాల్పడుతున్నట్టు గుర్తించి వారిపై 6 ఏకేసు నమోదు చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న సరుకు లారీతో కలిపి రూ.29 లక్షలు ఉంటుందని, దీనిపై తొండంగి పోలీసు స్టేషన్లో క్రిమినల్ కేసు నమోదుచేశామన్నారు.


స్వాధీనం చేసుకున్న లారీతో పౌరసరఫరా శాఖ అధికారులు

జైళ్ల శాఖలో కృత్రిమ మేధ

డీజీ అంజనీ కుమార్


సెంట్రల్ జైలును పరిశీలిస్తున్న అంజనీ కుమార్

రాజమహేంద్రవరం, మే 7(ఆంధ్రజ్యోతి): జైళ్ల శాఖలో కృత్రిమ మేధ ఉపయోగించి గార్డింగ్ సిబ్బందిపై ప్రస్తుతం ఉన్న భారాన్ని తగ్గించడంతోపాటు మరింత పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టబోతున్నామని జైళ్ల శాఖ డీజీ అంజనీ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కేంద్ర కారాగారాన్ని, మహిళా ప్రత్యేక కారాగారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్, కృత్రిమ మేధ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన పరిపాలన అందించాలని సీఎం చంద్రబాబు సంకల్పించారన్నారు. జైళ్లలో కూడా వాటిని వినియోగించుకునే అవకాశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఖైదీలతో మాట్లాడి సమస్యలు, సౌకర్యాలు, వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. కొందరు ఖైదీలు వారి ఇబ్బందులను విన్నవించుకోగా నిబంధనలను అనుసరించి వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ-ములాఖత్ ద్వారా ఖైదీలు వారి ఇంటికి నేరుగా వీడియోకాల్ ద్వారా మాట్లాడుకోడానికి చర్యలు చేపట్టామన్నారు. డీజీని కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహకిషోర్, మున్సిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్ మర్యాద పూర్వకంగా కలిసి పలుఅంశాలపై చర్చించారు. జైళ్ల శాఖ కోస్తాంధ్ర ప్రాంత డీఐజీ రవికిరణ్, పర్యవేక్షణాధికారి రాహుల్ పాల్గొన్నారు.

'సాంకేతికతలో భారత్ గ్లోబల్ లీడర్'


ప్రసంగిస్తున్న డాక్టర్ సీవీ.సర్వేశ్వరశర్మ

అమలాపురం, మే 7 (ఆంధ్రజ్యోతి): సాంకేతికతలో భారత్ గ్లోబల్ లీడర్ కానుందని సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ అన్నారు. జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా కోనసీమ జిల్లా అమలాపురం కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో బుధవారం ఏర్పాటుచేసిన కోనసీమ సైన్స్ పరిషత్ 2014వ సభలో డాక్టర్ సర్వేశ్వరశర్మ ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఐటీ, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, న్యూక్లియర్ సైన్సు తయారీ టెక్నాలజీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ వంటి అనేక రంగాల్లో భారత్ పురోగమన దిశలో ఉందని చెప్పారు. నన్నయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ ఎం.గోపాలకృష్ణ మాట్లాడుతూ సాంకేతిక దినోత్సవం రోజున మన దేశం సాధిస్తున్న అద్భుత విజయాలను వివరిస్తూ విద్యార్థుల్లో, ప్రజల్లో స్ఫూర్తి కల్పించాలనే ఉద్దేశంతో ఈకార్యక్రమాలు దేశమంతటా చేస్తున్నారని వివరించారు. స్కూల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎమ్.శ్యామలరావు మాట్లాడుతూ 1998 మే 11న తొలి స్వదేశీయ విమానం హంసా-3ని పరీక్షించారన్నారు. అదే రోజున త్రిశూల్ క్షిపణిని భారత్ విజయవంతంగా పరీక్షించిందన్నారు. వీటి జ్ఞాపకార్థం మాజీ ప్రధాని వాజ్‌పేయ్ మే 11 జాతీయ సాంకేతిక దినోత్సవంగా ప్రకటించారన్నారు. 2025 సంవత్సరానికి ఈ దినోత్సవ ఇతివృత్తంగా ఆవిష్కరణల ద్వారా సుస్థిర రేపటిని సాధించడం అని డాక్టర్ శ్రీరామచంద్రమూర్తి తెలిపారు.

సీఎంపై అభ్యంతరకర పోస్టు పెట్టిన వ్యక్తిపై కేసు

- పోలీసుల అదుపులో నిందితుడు
- ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన

కోరుకొండ, మే 7 (ఆంధ్రజ్యోతి): సీఎంపై అభ్యంతరకర పోస్టు పెట్టిన వ్యక్తిపై డీజీపీకి ఫిర్యాదు చేస్తాం అన్న ఆంధ్రజ్యోతి వార్తకు తూర్పుగోదావరి జిల్లా జిల్లా పోలీస్ యంత్రాంగం స్పందించింది. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు మీద అభ్యంతరకర పోస్టు పెట్టిన వ్యక్తిని రాజానగరం నియోజకవర్గం ముగ్గళ్ళ గ్రామానికి చెందిన ఓగులనేని కృష్ణచైతన్యగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి చర్యలు చేపట్టారు. గతంలో ఇతడు ఒక రౌడీషీటర్ ఫొటోతో సీఎం అని ఒక క్యాప్షన్ పెట్టి సోషల్ మీడియాతో పోస్టు పెట్టాడు. దీనిపై టీడీపీ శ్రేణులు ఆగ్రహించి కేసు పెట్టారు. ఈ మేరకు అభ్యంతరకర పోస్టుపై సీఎం టూర్‌ప్రోగ్రాం కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ తనయుడు పెందుర్తి అభిరాం డీజీపీ, ఎస్పీకి ఫిర్యాదు చేయడంపై ఈ వార్త ఆంధ్రజ్యోతి పత్రికలో ఏప్రిల్ 28న ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జిల్లా పోలీసు యంత్రాంగం పోస్టు పెట్టిన అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

లంచం నేరంపై ఆరుగురు ఉద్యోగులపై చర్యలు

కాకినాడ సిటీ, మే 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెదపూడి మండలంలో 2020 జనవరి 24న జరిగిన ఏసీబీ దాడిలో పట్టుబడ్డ ఆరుగురు ఉద్యోగులపై ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలకు దిగింది. పెదపూడి మండలం రిటైర్డ్ తహశీల్దార్ రాజ్యలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ శేఖ రరెడ్డి, వీఆర్వోలు సత్యనారాయణ, రాజు, వీఆర్వోలు చిన్నారావు, కుమార్‌కు నోటీసులు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వారు విధి నిర్వహణలో రైతులకు సంబంధించి భూములు ఆన్‌లైన్ చేసి పట్టాదారు పాస్ పుస్తకాల జారీకి లంచం తీసుకుంటూ పట్టుబడిన నేపథ్యంలో వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసింది.

దివిలిలో రెండు లారీలు ఢీ

పెద్దాపురం, మే 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం దివిలి సమీపంలో 2లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదం ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. వర్షం కారణంగానే రెండు లారీలు అదుపుతప్పి ఢీకొన్నట్టు స్థానికులు తెలిపారు. లారీల మధ్య బైక్ పైఉన్న వ్యక్తి తప్పించుకున్నాడు. పెద్దాపురం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నగదు బ్యాగు దొంగిలించిన ఐదుగురి అరెస్టు


రాయవరంలో కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఐ సురేష్‌బాబు

రాయవరం, మే 7 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్తున్న వ్యక్తి నుంచి నగదు బ్యాగును అపహరించుకుపోయిన కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్టు రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు బుధవారం విలేకర్లకు తెలిపారు. వివరాల ప్రకారం.. కోనసీమ జిల్లా రాయవరం గ్రామానికి చెందిన శేశెట్టి చిన్నికృష్ణ గత నెల 30న తన ఇంటి వద్ద నుంచి రూ.70వేల నగదు, ఎల్ఐసీ బాండ్‌లు, ఆధార్‌కార్డు, జిరాక్స్‌లు కలిగిన బ్యాగ్‌తో మోటారు బైక్‌పై రామచంద్రపురం బయలుదేరాడు. పసలపూడి సమీపంలోకి వచ్చేసరికి గుర్తుతెలియని వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి చిన్నికృష్ణ బ్యాగు లాక్కుని పరారైనట్టు రాయవరం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ కేసు నమోదు చేశారు. ఈనెల 6న రాయవరం మండలం లొల్ల సమీపంలో మోటారు సైకిళ్లను తనిఖీ చేస్తున్న సమయంలో 2 మోటారు సైకిళ్లపై వస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేపట్టారు. చిన్నకృష్ణను నుంచి బ్యాగును అపహరించుకుపోయిన ఐదుగురుగా గుర్తించారు. రామాలయం సమీపంలో ఉండే దత్తి నవీన్ అలియాస్ దత్తు, ఏలూరు పట్టణం జేవీఆర్‌నగర్‌కు చెందిన కోణాల రవితేజ, అనపర్తి మండలం పొలమూరు గ్రామానికి చెందిన నల్లమిల్లి ఆదిత్యరెడ్డి, ఏలూరు పట్టణం ఫిరంగుల దిబ్బ ప్రాంతానికి చెందిన దండురి సాయిరాజు, ఏలూరు పట్టణం జేవీఆర్‌నగర్‌కు చెందిన నడుపూరు కల్యాణ్‌ను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.54వేల నగదు, 2మోటారు వాహనాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు. నిందితులకు గతంలో నేర చరిత్ర ఉందని, వారిని అనపర్తి జేఎఫ్‌సీఎం ముందు హాజరుపర్చనున్నట్టు తెలిపారు. చోరీ కేసు ఛేదించిన ఎస్ఐ, హెచ్‌సీ సత్యకుమార్, పీసీలు వీరేంద్ర, విజయ్‌లను డీఎస్పీ బి.రఘువీర్, సీఐ పి.దొరరాజు అభినందించారు.

'ఎస్కేవీటీ'కి పీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ బదిలీ

కాకినాడ రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపాణ్యంను రాజమహేంద్రవరం ఎస్కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీ చేస్తూ బుధవారం సాయంత్రం మంగళగిరిలోని కళాశాల విద్య డైరెక్టర్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఆయన కళాశాలలో ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి నిధులను దుర్వినియోగం చేశారని, అంతేకాకుండా ప్రిన్సిపాల్ అనాలోచిత నిర్ణయాల వల్ల కళాశాల రావాల్సిన న్యాక్ ఏ గ్రేడ్ బీ++ కు పడిపోవడం, ఫీజులకు సంబంధించిన నగదును సమయానికి కళాశాల బ్యాంకు ఖాతాలో జమచేయక సోవడం వంటి పలు ఆరోపణలు ఉన్నాయి. అతనిపై ఆర్జేడీ స్థాయి అధికారులు గతేడాది నవంబరులోనూ, అదేవిధంగా ఫిబ్రవరిలోనూ విచారణచేపట్టారు. వీటితో పాటుగా కళాశాల పూర్వపు అధ్యాపకులు అతనిపై పలు అవినీతి ఆరోపణలుచేస్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే కమిషనర్ స్థాయి అధికారికి అతని పనితీరు నచ్చక గతంలో చోడవరం డిగ్రీ కళాశాలకు బదిలీ చేశారు. దీంతో ఆయన కోర్టును ఆశ్రయించి మళ్లీ ఇదే కళాశాల ప్రిన్సిపాల్‌గా కొనసాగారు. వీటన్నింటినీ పరిగణనలోనికి తీసుకుని తిరుపాణ్యంను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, ఆర్జేడీ పి.కళావతి, ఇటీవల రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు, విజయవాడలోని ఎస్ఆర్ఆర్, సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి ఇచ్చిన విచారణ నివేదికల ఆధారంగా కూడా తిరుపాణ్యంను బదిలీ చేసినట్టు సమాచారం.

అక్రమంగా తరలిస్తున్న 347 తాబేళ్ల పట్టివేత

మోతుగూడెం, మే 7 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 347 తాబేళ్లను అటవీ అధికారులు పట్టుకున్నారు. అక్కవరం రేంజ్ అటవీ క్షేత్రాధికారి గవిరెడ్డి వెంకటనాజీ తెలిపిన వివరాల ప్రకారం.. చింతూరు అటవీ డివిజన్ లక్కవరం రేంజీ పరిధిలోని తులసిపాక గ్రామ శివారు ప్రాంతంలోని సోకిలేరు బ్రిడ్జి వద్ద బుధవారం అమలాపురం నుంచి ఒడిశా రాష్ట్రానికి ఆటోలో తరలిస్తున్న పన్నెండు బస్తాల్లోని 347 తాబేళ్లను అధికారులు పట్టుకున్నారు. తాబేళ్ల ఆటోను స్వాధీనం చేసుకుని కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ఏరుపల్లి గ్రామంలో రంగోలి పోడి విక్రేత నెల్లూరి శ్రీనును అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న 347 తాబేళ్లలో 65 చనిపోయాయి. వాటిని చెక్‌పోస్టు సమీపంలోని అటవీ ప్రాంతంలో దహనం చేశారు. బతికున్న తాబేళ్లను చింతూరు శబరి నదిలో విడిచిపెట్టినట్టు పేర్కొన్నారు. దాడిలో ఎఫ్ఎస్‌వో విజయ్‌కుమార్, ఎఫ్‌బీవోలు సరిత, కుమారి, హెల్పర్లు పాల్గొన్నారు.


తాబేళ్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

విద్యార్థినికి అభినందన

మలికిపురం, మే 7(ఆంధ్రజ్యోతి): లక్కవరానికి చెందిన కారుపల్లి జ్ఞానిక ఇంటర్ ఫలితాల్లో 96శాతం మార్కులు సాధించడంతో లక్కవరంలో అభినందించారు. బుధవారం విద్యార్థినికి శాలువాల కప్పి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో రుద్రరాజు గోపాలకృష్ణరాజు, పలచోళ్ల రాంబాబు, కాయల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం

కపిలేశ్వరపురం, మే 7(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురంలోనున్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం బుధవారం జరిగింది. ఆలయ అర్చకుడు కె.కృష్ణభగవాన్ స్వామివారికి పలు పూజలు జరిపారు. విశ్రాంత ఆడిటర్ ఎస్.వీరవెంకట సత్యనారాయణ, కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఆలయం వద్ద అన్నసమారాధన జరిపారు.

దేశం కోసం 'అల్లూరి' త్యాగనిరతి చిరస్మరణీయం

మన్యం వీరుడు సీతారామరాజు వర్ధంతి


అల్లవరం: రెల్లుగడ్డలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి తదితరులు

అల్లవరం, మే 7(ఆంధ్రజ్యోతి):దేశం కోసం పోరాడి బ్రిటీషు వారిని ఎదురించి ప్రాణాలు అర్పించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగనిరతి చిరస్మరణీయమని టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుధవారం రెల్లుగడ్డలో అల్లూరి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కోడూరుపాడు, గుండెపూడి, రెల్లుగడ్డ, కొమరగిరిపట్నం గ్రామాల్లో అల్లూరి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో నడింపల్లి సుబ్రహ్మణ్యంరాజు, డీఎస్ఎన్ రాజు, మంతెన సురేష్‌రాజు, దాట్ల గోపీరాజు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, గుంటూరి కృష్ణంరాజు, గుంటూరి బాలవెంకట్రాజు, గుంటూరి శ్రీనురాజు, బొక్కా నాగశివప్రసాద్, పచ్చిమాల ఏడుకొండలు, ఎం.రాంబాబు పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ముమ్మిడివరంలో బుధవారం నిర్వహించారు. చినకొత్తలంకలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మన్యం వీరుడు అల్లూరి బ్రిటీషు వారిపై పోరాడిన విధానాలను పలువురు వక్తలు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పత్సమట్ల ఉదయభాస్కరవర్మ, పీవీవీఎస్ వర్మ, ఎంపీటీసీ కొత్తూరి వీణారాణి, ముదునూరి పద్మనాభరాజు, పి.చైతన్యవర్మ, ఎం.చంద్రమౌళీరాజు పాల్గొన్నారు. అలాగే ముమ్మిడివరం సీఐటీయూ కార్యాలయం వద్ద సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్‌లు పాల్గొని అల్లూరి స్వాతంత్ర్య పోరాటంలో సాగించిన సాహస వీరగాథలను వివరించారు. డి.వీరరాఘవులు, నిమ్మకాయల వెంకటేష్, కాకి రాంబాబు, అనసూరి లక్ష్మణరావు, పచ్చిమాల శివకుమార్, తులసీరావు, యలమంచిలి బాలరాజు, నిమ్మకాయల లక్ష్మీ తులుపులమ్మ, సీఐటీయూ నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి గ్రామ పంచాయతీ వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ జంపన బుజ్జిరాజు నేతృత్వంలో అల్లూరి సేవలను పలువురు కొనియాడారు. అనంతరం ఇటీవల కశ్మీర్ ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి సంతాపం తెలిపారు. మంగళవారం రాత్రి పాకిస్తాన్ ఉగ్ర స్థావరాలపై భారత్ ఆర్మీ జరిపిన దాడుల నేపథ్యంలో జంపన బుజ్జిరాజు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ మోదీ ప్రభుత్వం దేశాన్ని కాపాడేందుకు తీసుకుంటున్న చర్యలు గర్వించదగ్గ విషమన్నారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత స్వాతంత్ర్య చరిత్రలో మహోన్నత వ్యక్తి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని బుధవారం నిర్వహించారు. సీతారామరాజు చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు, వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, పీఆర్వో ఎన్.రాజు పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. సీతారామరాజును యువత ఆదర్శంగా తీసుకుని సమాజం, దేశం కోసం సేవ చేయాలని ప్రిన్సిపాల్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రతాప్‌రాజ్, గోపాలకృష్ణ, నాగరాజు, నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

యానాం, (ఆంధ్రజ్యోతి): యానాం క్షత్రిపరిషత్ వద్ద గల మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి బుధవారం యానాం పరిపాలనాధికారి మునిస్వామి, అధికారులు తదితరులు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీఐ అడలరసన్, ఎస్ఐ పూనీత్‌రాజ్, శేరు నూకరాజు, ఇతర అధికారులు, యర్రా సుబ్రహ్మణ్యేశ్వరరావు, క్షత్రియయూత్ సభ్యులు రాముురాజు, దాట్ల దేవదానంరాజు, వెంకట కృష్ణంరాజు, సహదేవరాజు, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని వైసీపీ రిలే దీక్షలు


మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి

అమలాపురం, మే7(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలో ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ అమలాపురంలోని వంటెద్దు కాంప్లెక్సు వద్ద జిల్లా వైసీపీ ఆధ్వర్యంలో భారీగా రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని నిర్వహించారు. కలెక్టరేట్‌కు వెళ్లే మార్గంలో వంటెద్దు వెంకన్నాయుడు కాంప్లెక్సు వద్ద ఏర్పాటుచేసిన వైసీపీదీక్షా శిబిరాన్ని వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో రైతు సేవా కేంద్రాలకు విధించిన ఆంక్షలు తొలగించాలని, వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలనే డిమాండ్‌తో ప్రధానంగా ఈకార్యక్రమం నిర్వహించారు. వందల సంఖ్యలో పార్టీ శ్రేణులు దీక్షా శిబిరంలో పాల్గొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయిల్, పండుల రవీంద్రబాబు, మాజీమంత్రులు గొల్లపల్లి సూర్యారావు, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పొన్నాడ సతీష్‌కుమార్, డాక్టర్ పినిపే శ్రీకాంత్, గన్నవరపు శ్రీనివాస్, పిల్లి సూర్యప్రకాష్, మాజీ ఎంపీ చింతా అనురాధ, మాజీ ఎమ్మెల్యేలు పాముల రాజేశ్వరిదేవి, మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు రిలే దీక్షలో పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన కల్పించాలి


ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న మలేరియా జిల్లా అధికారి వెంకటేశ్వరరావు

పి.గన్నవరం, మే 7(ఆంధ్రజ్యోతి): కీటక జనిత వ్యాధులైన మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా తదితర వ్యాధులపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని మలేరియా జిల్లా అధికారి నక్కా వెంకటేశ్వరరావు సిబ్బందికి సూచించారు. నాగుల్లంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించి మాట్లాడారు. గ్రామీణ స్థాయిలో పంచాయతీల సహకారంతో కీటక వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు సూచనలు చేయడంతో పాటు ఇంటింటి సర్వే చేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి పరిసరాల శుభ్రతపై ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో ఉన్న లేబొరేటరీని ఆయన పరిశీలించి రక్తపరీక్షలపై సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట వైద్యాధికారులు డాక్టర్ షేక్ జానీస్, సబ్ యూనిట్ అధికారి ఎం.రాజశేఖర్, ఎంపీహెచ్ఈవో నాగరాజు, ఎంఎస్ఎస్ కుమారి, వీవీవీఎస్ఎన్ మూర్తి, ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు ఉన్నారు.

ఏటిగట్టు నిర్మాణం చేపట్టండి


ఏటిగట్టును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కాట్రేనికోన, మే 7(ఆంధ్రజ్యోతి): పల్లంకుర్రు- మురమళ్ల గోదావరి ఏటిగట్టు రోడ్డు కుండలేశ్వరం పుష్కరాల ఘాట్‌కు పది మీటర్ల దూరంలో పంటకాల్వ వైపునకు దిగజారిపోయింది. గతంలో ఈవిషయాన్ని పలుమార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని సీపీఎం నాయకులు కారెం వెంకటేశ్వరరావు, జి.దుర్గాప్రసాద్ ఆరోపించారు. ఈరహదారిపై ట్రాఫిక్ బాగా పెరిగిందన్నారు. కాట్రేనికోన, కందికుప్ప, పల్లంకుర్రు కాకినాడ వెళ్ళేవారికి ఇది ప్రధాన రహదారిగా ఉందన్నారు. దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన కుండలేశ్వరానికి ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చేందుకు ఈరహదారి ఎంతగానో ఉపయోగపడుతోంది. ఇప్పటికైనా ఏటిగట్టు నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు డిమాండ్ చేశారు.

వాసవీమాత ఆలయాల్లో పూజలు


అంబాజీపేట: కుంకుమపూజలు నిర్వహిస్తున్న దృశ్యం



యానాం, పి.గన్నవరం: మానేపల్లిలో వాసవీమాత

అంతర్వేది, మే 7(ఆంధ్రజ్యోతి): శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా సఖినేటిపల్లి సెంటర్‌లోని ఆలయం వద్ద బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. వాసవీ అమ్మవారి ఆలయంలో ఆర్యవైశ్య మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. 1116గాజులతో ప్రత్యేకంగా అమ్మవార్ని అలంకరించారు. 21మంది ముత్తయిదువులు పవిత్ర కలశాలతో ఊరేగింపు నిర్వహించారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల ఇలవేల్పు అయిన వాసవీమాత జయంతి సందర్భంగా అల్లవరంలో వాసవీమాత విగ్రహాలను పల్లకీలో ఉంచి బుధవారం ఘనంగా ఊరేగించారు. ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు గమిడి సూరిబాబు, వెదుళ్లపల్లి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వాసవీమాతకు పండ్ల రసాలతో అభిషేకాలు, మహిళలతో కుంకుమ పూజలు ఘనంగా జరిగాయి. బలభద్ర రవి, బలభద్ర కోటయ్య, వెదుళ్లపల్లి శివ, వి.గుప్తా, బలభద్ర కృష్ణతో పాటు ఆర్యవైశ్యులు, మహిళలు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన జరిగింది.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి పుట్టినరోజును పురస్కరించుకుని మానేపల్లిలో ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవార్కి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. పెంటపాటి వెంకటేశ్వరరావు, శ్రీకాకోళపు వెంకటేశ్వరరావు, నూలు మురళీ, గుగ్గెళ్ళ మధు, శిరం వెంకటేశ్వరరావు, గుగ్గెళ్ళ మూర్తి, శిరం శ్రీనివాసరావు, నూలు తాతాజీ పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవార్ని పుట్టినరోజు సందర్భంగా గ్రామంలో ఊరేగించారు. స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న శ్రీవాసవీకన్యాకపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆలయ అర్చకులు చంద్రమౌళి ధనుష్‌శర్మ ఆధ్వర్యంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 102రకాల వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ఆల యం వద్ద అన్నసమారాధన నిర్వహించా రు. గంగలకుర్రు అగ్రహారంలో వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవార్ని పురవీధుల్లో ఊరేగించారు.

యానాం, (ఆంధ్రజ్యోతి): యానాం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదినోత్సవం సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం అమ్మవార్ని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకం, అర్చన, కుంకుమార్చన తదితర విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం సింహవాహనంపై అమ్మవార్ని పురవీధుల్లో ఉరేగించారు. ఈసందర్భంగా కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన వైశ్య విద్యార్థులకు జ్ఞాపిక, నగదు పురస్కారంతో సత్కరించారు.

చేతి వృత్తులను ప్రోత్సహిస్తాం : ఎంపీ హరీష్


సఖినేటిపల్లిలో జూట్ బ్యాగ్ స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్

అంతర్వేది, మే 7(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో చేతివృత్తులు చేసుకునే గ్రామీణ మహిళలను కూటమి ప్రభుత్వం తరపున ప్రోత్సహిస్తామని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ తెలిపారు. సఖినేటిపల్లిలో ఏర్పాటుచేసిన ఒక జూట్ బ్యాగ్ స్టాల్‌ను ఆయన బుధవారం సందర్శించారు. చేతివృత్తులతో తయారు చేస్తున్న ఉత్పత్తులను దేశవాళీ మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడేలా కృషి చేస్తానని ఎంపీ అన్నారు. ప్రతీ మహిళ ఇంటి వద్దనే ఉండి ఆర్థిక పురోభివృద్ధి సాధించడంతో పాటు ఇతరులకు ఉపాధి కలిగించేలా ఆలోచించి చేతివత్తులు చేయడం అభినందనీయమన్నారు. తూర్పుపాలేనికి చెందిన తోట ఉమామహేశ్వరి వద్ద కొన్ని జూట్ బ్యాగులను కొనుగోలు చేశారు. ప్రతీ మహిళ మన కోనసీమ జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు వెళ్లి చేతివృత్తులతో ఉత్పత్తులను తయారుచేసి దేశవ్యాప్త మార్కెట్‌ను అందుకునేలా వారిని ప్రోత్సాహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ముప్పర్తి నాని, తాడి సత్యనారాయణ, చాగంటి స్వామి, కడలి వెంకటరత్నం, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా భీమారావు



అంబాజీపేట, మే 7(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జి.భీమారావు బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేసిన సరోవరరావుకు పదోన్నతి రావడంతో అయినవిల్లి ఎంపీడీవోగా బదలీయ్యారు. ఆయన స్థానంలో ఈవోపీఆర్డీ భీమారావును ఎంపీడీవోగా నియమించారు. ఆయనకు ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఇంటింటి సర్వే నిర్వహించాలి

డీపీఎంవో టీవీకే శ్రీనివాసరావు

అంబాజీపేట, మే 7(ఆంధ్రజ్యోతి): వ్యాధులను గుర్తించేందుకు ప్రతి గ్రామంలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించాలని డీపీఎంవో టీవీకే శ్రీనివాసరావు అన్నారు. అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముక్కామల, అంబాజీపేట పీహెచ్‌సీ సిబ్బందితో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీల్లో డెలివరీలు ఎక్కువ అయ్యేలా ఏఎన్ఎంలు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అందిస్తున్న పథకాలనుప్రజలకు వివరించాలన్నారు. వైద్యాధికారులు కేఎన్ శ్రీనివాస్, సూర్యనగేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానవాటికలో మౌలిక సదుపాయాలు కల్పిస్తా


శ్మశానవాటికను పరిశీలిస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి, స్థానిక గ్రామస్తులు

యానాం, మే7(ఆంధ్రజ్యోతి): యానాం మెట్టకుర్రు వార్డు పరిధిలో ఉన్న శ్మశానవాటికకు కనీస సౌకర్యాలు కల్పించాలని సమీప గ్రామాల ప్రజలు కోరారు. బుధవారం ఉదయం గ్రామస్తులతో కలిసి శ్మశానవాటికను పుదుచ్చేరి ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పరిశీలించారు. శ్మశానవాటిలో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని మల్లాడి హామీ ఇచ్చారు. అక్కడ నుంచే సంబంధిత ఉన్నతాధికారులతో మల్లాడి ఫోన్‌లో మాట్లాడారు. చేపట్టాల్సిన పనులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. శ్మశానవాటికలో ఒక పర్యవేక్షకుడిని గ్రామస్తులు ఏర్పాటుచేస్తే, అతడికి ప్రతినెల తానే జీతాభత్యాలు సమకురుస్తానని చెప్పారు. కార్యక్రమంలో గణపతినగర్, మెట్టకుర్రు, ఆదిఆంధ్రపేట, రమబాయినగర్, వంశీకృష్ణాకాలనీ, ఫిషర్‌మెన్‌పేట, రామన్నకోడు సమీప గ్రామల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి అభిషేకాలు

మలికిపురం, మే 7(ఆంధ్రజ్యోతి): మలికిపురం ఎత్తు వంతెన వద్ద నూతనంగా నిర్మించిన శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి ఆలయం వద్ద స్వామివారికి బుధవారం ఉదయం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం పల్లకీ సేవ జరిపారు. రాత్రి ఉత్తర నక్షత్రం ప్రారంభ సమయంలో పుష్పాభిషేకం నిర్వహించారు. ఆలయ పూజారి నందన్ నంబూద్రి పూజలు నిర్వహించారు.

ఎడతెరిపిలేని వర్షం

రావులపాలెం,మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం మధ్యాహ్నం సుమారు రెండు గంటల పాటు ఎడతెరిపిలేని వర్షం కురిసింది. దీంతో కల్లాల్లో ఉన్న ధాన్యపు రాశుల వద్దకు వర్షపు వచ్చి చేరింది. ఒక్కసారిగా ఆకాశంలో మార్పులు వచ్చి వర్షం కురవడంతో కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం, పట్టుబడి పట్టిన బస్తాలు తడిచి ముద్దయ్యాయి.

పేదలకు ప్రభుత్వం అండ: ఎమ్మెల్యే


పి.గన్నవరంలో లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, మే 7(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ప్రతి నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం జనసేన పార్టీ క్యాంపు కార్యాలయంలో బుధవారం రూ.14.49లక్షల చెక్కులను గ్రామాల వారీగా 21మంది లబ్ధిదారులకు అందించారు. ఆరోగ్యశ్రీ, సీఎం సహాయ నిధి ద్వారా నిరుపేదల వైద్య అవసరాలకు కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.2.14కోట్లు సీఎం సహాయ నిధి ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు అందించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమ, దాసరి వీరవెంకట సత్యనారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, వాసంశెట్టి కుమార్, యడ్ల ఏసు, కర్రి బాబురావు, షేక్ దొరబాబు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల తీర్థ మహోత్సవం

మామిడికుదురు, మే 7(ఆంధ్రజ్యోతి): బి.దొడ్డవరం గ్రామదేవతలు ముత్యాలమ్మ, గోగులమ్మ తీర్థ మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. తీర్థంలో అధిక సంఖ్యలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ముడుపులు, మొక్కులు సమర్పించారు. తీర్థంతో జాతర మహోత్సవాలు ముగిశాయి. గురువారం ఆలయాల వద్ద అన్నసమారాధన నిర్వహిస్తామని కమిటీ తెలిపింది.

'సెలవుల్లో తరగతులు నిర్వహించరాదు'

మలికిపురం, మే 7(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో ప్రైవేటు విద్యా సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహించడం ఆపాలని అధికారులకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకులు దేవ రాజజేంద్రప్రసాద్ బుధవారం విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఎండలు 40డిగ్రీలు దాటి ఎండలు మండిపోతుంటే విద్యార్థులకు సెలవుల్లో ఆటవిడుపు లేకుండా ప్రైవేటు విద్యా సంస్థలు తీవ్రమైన ఒత్తిడికి గురిచేస్తున్నాయన్నారు.

'పాకిస్థాన్‌కు చెంపపెట్టు'

మలికిపురం, మే 7(ఆంధ్రజ్యోతి): భారత్ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ పాకిస్థాన్‌కు చెంపపెట్టు లాంటిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్ అన్నారు. ఉగ్రవాదాన్ని పోషిస్తున్న పాకిస్తాన్‌కు భారత్ ఆర్మీ గుణపాఠం చెప్పిందన్నారు. పాకిస్తానీ ప్రేరేపిత ఉగ్రవాదులు ఎంతో మంది భారతీయులను పొట్టన పెట్టుకున్నారన్నారు. పాకిస్తాన్ ప్రజాప్రతినిధులు భారత్‌పై అవాకులు, చవాకులు మాట్లాడడం మానుకోవాలన్నారు.

ఆక్రమణలు తొలగించి రోడ్డు ఏర్పాటు

మామిడికుదురు, మే 7(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి దేవస్థానానికి వెళ్లే రోడ్డును రూ.15లక్షలతో నిర్మిస్తున్నారు. దేవస్థానానికి వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను పంచాయతీరాజ్ డీఈ అన్యం రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం దేవస్థానం సిబ్బంది సహకారంతో ఆక్రమణలు తొలగించారు. 4 మీటర్ల వెడల్పు, 98 మీటర్ల పొడవుతో రోడ్డును ఏర్పాటు చేయడం వల్ల దేవస్థానానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తొలగుతాయని డీఈ తెలిపారు. ఆక్రమణల తొలగింపుకు సహకారం అందిస్తున్న దేవస్థానం సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు, స్థానిక సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ఎంపీ హరీష్‌మాధుర్ పరామర్శ

అంతర్వేది, మే 7(ఆంధ్రజ్యోతి): గుడిమూల గ్రామంలో ఇటీవల విద్యుత్ ప్రమాదంతో గొర్ల రవికృష్ణ మృతిచెందాడు. ఇద్దరు పిల్లలు, భార్య సునీతను బుధవారం అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ పరామర్శించారు. టీడీపీ కార్యకర్తగా ఎన్నో సేవలు అందించిన రవికృష్ణ కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ముందుగా రవికృష్ణ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని, కార్యదర్శి తాడి సత్యనారాయణ, సర్పంచ్ దెందుకూరి శ్రీహరిరాజు, మంగెన నాని, గ్రామపెద్దలు కూటమిశ్రేణులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికీ తాగునీరు

అల్లవరం, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంటికీ తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు అన్నారు. ఓడలరేవులో ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో రూ.47.20లక్షల జలజీవన్ మిషన్ నిధులతో ఇంటింటికీ తాగునీటి పైపులైను పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొల్లు విష్ణుమూర్తి, నాతి లెనిన్‌బాబు, గుండెమేను శ్రీనివాస్, పెమ్మాని వెంకటరామారావు, రేకాడి శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠస్వామి వర్ధంతి

అల్లవరం, మే 7(ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నం ఆర్ష విజ్ఞానభారతి ఆశ్రమంలో సత్యానందస్వామి శిష్యులు నీలకంఠస్వామి (చినస్వామి) పుణ్యారాధన వర్ధంతిని బుధవారం నిర్వహించారు. నీలకంఠస్వామి ఆశ్రమంలో గీతాపారాయణ, గురుపూజ, భజన కార్యక్రమాలు జరిగాయి. సీనియర్ జర్నలిస్టు నడింపల్లి సీతారామరాజు, గుర్రింక సత్యనారాయణ మాస్టారు, ఆకుల వెంకటేశ్వరరావు, రుద్రరాజు వెంకట్రామరాజు, కాయల వీరవెంకటసత్యనారాయణ, బండారు ఈశ్వరరావు, కొమరగిరిపట్నం, బెండమూర్లంక తదితర గ్రామాల చినస్వామి భక్తులు, ఆర్ష విజ్ఞాన భారతి అధ్యాపకులు తదితరులు చినస్వామి పుణ్యారాధన పూజల్లో పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్య వర్ధంతి

ముమ్మిడివరం, మే 7(ఆంధ్రజ్యోతి): తొలి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన దామోదరం సంజీవయ్య 53వ వర్ధంతి కార్యక్రమాన్ని ముమ్మిడివరంలో బుధవారం నిర్వహించారు. పోలమ్మ చెరువుగట్టున జైబుద్ధ పార్కులో సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన అందించిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ, అభ్యుదయ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, కాశి సింహాద్రివర్మ, బొజ్జా బాలకృష్ణ, దాసరి సత్యనారాయణ, వడ్డి శ్రీనివాస్, కాశి శ్రీను, రేవు త్రిమూర్తులు పాల్గొన్నారు.

నగరంలో మాక్‌డ్రిల్


నగరంలో జీసీఎస్ వద్ద మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

మామిడికుదురు, మే 7(ఆంధ్రజ్యోతి): అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలు వివరిస్తూ నగరం ఓఎన్జీసీ వద్ద బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. భారత్-పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో మాక్‌డ్రిల్‌ను ఓఎన్జీసీ, పోలీసు, రెవెన్యూశాఖ అధికారులు నిర్వహించారు. యుద్ధం వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహశీల్దార్ కె.శరణ్య, ఎస్ఐ పి.సురేష్, ఆర్ఐ ఇబ్రహీం, ఓఎన్జీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద ట్రస్టుకు రూ.2.50లక్షల విరాళం


దాతకు స్వామివారి చిత్రపటం బహూకరిస్తున్న ప్రధాన అర్చకులు

అయినవిల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం మండలం నరేంద్రపురానికి చెందిన త్సల్లా సుబ్రహ్మణ్యకృష్ణభాస్కర్-లక్ష్మీమానస దంపతులు కుటుంబ సమేతంగా అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అన్నప్రసాద ట్రస్టుకు రూ.2.50లక్షల విరాళం అందజేశారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు ఆశీర్వాదం అందజేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెడితే కేసు

సీఐ రుద్రరాజు హెచ్చరిక

మామిడికుదురు, మే 7(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన, అనుచితమైన పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తామని పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు హెచ్చరించారు. నగరం పోలీసుస్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీని కించపరుస్తూ అభ్యంతరకరమైన, అనుచితమైన వ్యాఖ్యలతో ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టిన మామిడికుదురు మండలం ముత్యాలపాలేనికి చెందిన కర్రి మోహన్‌కనకదుర్గారావును అరెస్టుచేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించామన్నారు. సోషల్ మీడియాలో పెట్టే ప్రతీ పోస్టును జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఒక పోలీసు వింగ్ పరిశీలిస్తోందన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం



అంబాజీపేట, మే 7(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట శివారు కొర్లపాటివారిపాలెంలో వేంచేసియున్న శ్రీభూసమేత శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణం బుధవారం రాత్రి కన్నుల పండుగగా జరిగింది. ఆలయ అర్చకులు పాణింగపల్లి నరసింహచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, గోవింద నామస్మరణలతో వెంకన్న కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణమంతా వందలాది మంది మహిళలు స్వామి కల్యాణాన్ని భక్తి శ్రద్ధలతో తిలకించారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. తొలుత స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పురవీదుల్లో ఊరేగించారు.

బాధిత కుటుంబాలకు చిర్ల పరామర్శ

అంబాజీపేట, మే 7(ఆంధ్రజ్యోతి): సింహాచలంలో సింహాద్రి అప్పన్న చందనోత్సవ కార్యక్రమానికి వెళ్లి గోడకూలిన ఘటనలో ఇద్దరు యువకులు మృతిచెందగా బుధవారం బాధిత కుటుంబాలను వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి బుధవారం పరామర్శించారు. స్థానిక కొర్లపాటివారిపాలెంలో స్వామినాయుడు తండ్రి దత్తుడు, శేషారావు తండ్రి శ్రీనివాసరావులను ఆయన పరామర్శించి ఓదార్చారు. యువకుల చిత్రపటాల వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల శేఖర్, నాయకులు దొమ్మేటి సత్యమోహన్, కొర్లపాటి కోటబాబు, సుదాబత్తుల రాము, మైలా ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం

కపిలేశ్వరపురం, మే 7(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురంలోనున్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం బుధవారం జరిగింది. ఆలయ అర్చకుడు కె.కృష్ణభగవాన్ స్వామివారికి పలు పూజలు జరిపారు. విశ్రాంత ఆడిటర్ ఎస్.వీరవెంకట సత్యనారాయణ, కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఆలయం వద్ద అన్న సమారాధన జరిపారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజల్లో పాల్గొన్న భక్తులు

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.3.92లక్షలు

ఆత్రేయపురం, మే 7(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల తో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తజనం అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,92,517 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

నేటి నుంచి రమా సత్యనారాయణస్వామి కల్యాణోత్సవాలు

ఆత్రేయపురం, మే 7(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి దేవస్థానంలోని ఉపాలయంలో ఉన్న రమాసత్యనారాయణ స్వామి వార్షిక దివ్య కల్యాణోత్సవం గురువారం నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి తెలిపారు. గురువారం సాయంత్రం అంకుర్పారణ, ధ్వజారోహణం, స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. 10న సదస్యం, 12న పూర్ణాహుతి, చక్రస్నానం, 13న శ్రీపుష్పోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

నేడు ఉమాకమండలేశ్వరస్వామి కల్యాణం...: ర్యాలి గ్రామంలోనున్న ఉమాకమండలేశ్వరస్వామి కల్యాణోత్సవం నేటి నుంచి 12వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు ఈవో రమణ మూర్తి తెలిపారు. గురువారం సాయంత్రం అంకుర్పారణ, ధ్వజారోహణ, స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. 10న సదస్యం, 12న పూర్ణాహుతి, త్రిశూలస్నానం, శ్రీపుష్పోత్సవంతో ఉత్సవాలు నిర్వహిస్తునట్లు ఈవో తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో ఉమాకమండలేశ్వరస్వామి

ఉగ్రశిబిరాల ధ్వంసం సైనిక సత్తాకు నిదర్శనం



వద్దిపర్రులో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆత్రేయపురం, మే 7(ఆంధ్రజ్యోతి): ఉగ్ర శిబిరాల ధ్వంసం మన సైనిక సత్తాకు నిదర్శనమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బుధవారం వద్దిపర్రులో జాతీయ జెండాలతో ఆయన కూటమి శ్రేణులతో కలిసి ర్యాలీ జరిపారు. భారత సైనం పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పిందన్నారు. భారతీయలంతా ప్రభుత్వానికి అండగా నిలిచి సైనికులకు మనోధైర్యాన్ని కల్పిద్దామన్నారు. కార్యక్రమంలో ఎం. భాస్కరరావు, జుజ్జవరపు శ్యామల, హరిబాబు, కనుమూరి రామలింగరాజు, కె.రామకృష్ణంరాజు, కాయల జగన్నాధం, దండు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



రావులపాలెంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్

తడి,పొడి చెత్త సేకరణ చేపట్టాలి

రావులపాలెం, మే 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తడి,పొడి చెత్త సేకరణ చేపట్టడంతో పాటు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ ఆదేశించారు. రావులపాలెంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీకృష్ణ కార్యదర్శి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



ఆలమూరు మండలం చింతలూరులో వాసవీమాత ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఆలమూరు, మే 7(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలంలో వాసవీమాత జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. చింతలూరు, పెదపళ్ల ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో చింతలూరు ఆర్యవైశ్య సత్రంలో వాసవీ మాత జయంతిని జరిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. ముందుగా పెదపళ్ల నుంచి ఊరేగింపుతో అమ్మవారిని ప్రత్యేక వాహనంపై మహిళా భక్తులు తీసుకొచ్చారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు కంచర్ల జనార్ధనరావు, కంచర్ల గంగారావు, చెక్కా త్రిమూర్తులు తదితరులు నాయకత్వం వహించారు.

ఆలమూరులో: వాసవీమాత జయంతిని ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో ఆలమూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక జనార్ధన స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన వేదికపై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

వాసవీమాతకు పూజలు

ద్రాక్షారామ, (ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతిని పురస్కరించుకుని బుధవారం ద్రాక్షారామలోని ఆలయంలో పూజలు నిర్వహించారు. ఉదయం 5.30 గంటలకు గణపతి పూజ, అభిషేకం తదుపరి పుణ్యాహ వచనం, చండీపారాయణం, చండీహోమం, శ్రీచక్రార్చన, అనంతరం నీరాజన మంత్ర పుష్పాలు జరిపారు. ఆయా కార్యక్రమాల్లో కొమ్మిశెట్టి గోపాల్, రమాశైలజ, వరదా సంతోష్‌కుమార్, రామనాగ సత్య సౌందర్యబిందు దంపతులతో పూజలు నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి మహిళా మండలిచే లలితా సహస్ర పారాయణం జరిపారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవం జరిగింది. కార్యక్రమంలో వాసవీ కన్యకా పరమేశ్వరి సమాజం అధ్యక్షుడు కొమ్మిశెట్టి గోపాల్, ప్రధాన కార్యదర్శి అప్పన రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మండపేట, (ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతిని మండపేటలో బుధవారం నిర్వహించారు. స్థానిక వల్లూరి వీధిలో ఉన్న అమ్మవారి ఆలయం వద్ద కన్యకా పరమేశ్వరి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద నుంచి కలువ పువ్వు సెంటర్, కేపీ రోడ్డు వీదుగా అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు కాళ్లకూరి గొల్లబాబు, అధ్యక్షుడు సంకా శ్రీనివాసరంగ, ఆలయ ధర్మకర్త బోనగిరి సుబ్బారావు తదితరులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





మండపేటలో వాసవీ కన్యకా పరమేశ్వరి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు. పక్క చిత్రంలో రామచంద్రపురంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



రామచంద్రపురంలోని కొత్తూరులో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు



కపిలేశ్వరపురం మండలం అంగరలో అల్లూరి వర్ధంతి సభలో మాట్లాడుతున్న వక్తలు



కొత్తపేటలో జాతీయ నాయకుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

అల్లూరి స్ఫూర్తితో ముందుకు సాగుదాం

• వర్ధంతి సభలో వక్తలు • సీతారామరాజు విగ్రహాలకు ఘన నివాళి

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 7 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు వర్ధంతిని బుధవారం రామచంద్రపురం పట్టణం, మండలంలో నిర్వహించారు. స్థానిక పాత బస్టాండు సెంటర్‌లో పీడీఎస్‌యు, పీవైఎల్ ఆధ్వర్యంలో అల్లూరి వర్ధంతిని పురస్కరించుకుని అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పీడీఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, సుభీభవ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకన్న, పీవైఎల్ జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం, సీపీఐ పట్టణ కార్యదర్శి ఎం.రాము, చింతా రాజారెడ్డి, అంబటి కృష్ణ తదితరులు నివాళులర్పించారు. కొత్తూరులో అల్లూరి వర్ధంతిని పురస్కరించుకుని ఏఐకెఎంఎస్, ఐఎఫ్‌టీయు ఆధ్వర్యంలో అల్లూరి సీతారామారాజు చిత్రపటానికి సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు జనిపెల్ల సత్తిబాబు, ఏఐకెఎంఎస్ నాయకులు మల్లవరపు రాజు నివాళులర్పించారు.

ద్రాక్షారామలో: అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ద్రాక్షారామ శ్రీనివాస శైల పారిశ్రామిక శిక్షణా సంస్థ వద్ద నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ సత్యనారాయణ తదితరులు నివాళులర్పించారు. కార్యక్రమంలో జి.భీమేశ్వరరావు, సీహెచ్ ప్రకాష్, ఎస్.కల్యాణ్, పి.తేజ, ఎం.భవానీ శంకర్, మదుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం (ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఆయా ప్రాంతాల్లో నిర్వహించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకటరామన్ తదితరులు అల్లూరికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఆత్రేయపురం, వసంతవాడ, తాడిపూడి, పులిదిండి తదితర గ్రామాల్లో అల్లూరి విగ్రహాలకు పలువురు నివాళులర్పించారు. క్షత్రియ యూత్ ఆధ్వర్యం లో పలువురు వర్ధంతిని జరిపారు.

విప్లవ వీరుడు అల్లూరి

కపిలేశ్వరపురం (ఆంధ్రజ్యోతి): స్వాతంత్రం కోసం ఆదివాసీలతో కలిసి పోరాటం సాగించిన విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు అని భారత కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి తుర్పుగోదావరి జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని అంగరలో అల్లూరి వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య, అఖిల భారత రైతుకూలీ సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సీతారామరాజు విగ్రహానికి ఆయా సంఘాల నాయకులు వెంకటేశ్వరరావు, భీమశంకరం, లంకె విజయ్‌కుమార్ తదితరులు నివాళులర్పించారు. కార్యక్రమంలో నున్న రమేష్, చీకట్ల శ్రీనివాస్, తుట్టపు శ్రీనివాస్, కంజుల గోవిందరాజు, వి.వెంకటరమణ, ఎల్.విజయ్‌కుమార్, ఎల్.స్వామి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు అల్లూరి వర్ధంతిని పురస్కరించుకుని పలివెల అల్లూరి సీతారామరాజు జాతీయ సంస్థ ఆధ్వర్యంలో సమరయోధుల విగ్రహాలకు పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రధాన కార్యదర్శి దుళ్ళ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అల్లూరి కాంస్య విగ్రహాన్ని పార్లమెంట్, ఏపీ భవన్ ప్రాంగణాల్లో ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్.దొరబాబు, జి.కృష్ణ, దుగ్గిరాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): విప్లవ వీరుడు అల్లూరి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. రావులపాలెం జడ్పీ పాఠశాలలో ఉన్న అల్లూరి విగ్రహ వేదిక వద్ద అల్లూరి జాతీయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శత వర్ధంతి ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డి.వెంకటేశ్వర్లు, సఖినేటి వాకులరాజు, పెన్మత్స సోమరాజు తదితరులు అల్లూరి విగ్రహానికి నివాళులర్పించారు.



రావులపాలెంలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

ఆత్రేయపురం, మే 7(ఆంధ్రజ్యోతి): ర్యాలి వేంకటేశ్వరనగర్‌లోనున్న వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా స్వామి వారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కోలాట ప్రదర్శన, పలు వాయిద్యాలతో స్వామివారి ఊరేగింపు ఆయా వీధుల్లో నిర్వహించారు. గురువారం రాత్రి 7 గంటలకు స్వామివారి కల్యాణం పంచామృతాభిషేకం, పుష్పయాగం, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

పోలేరమ్మకు భక్తుల పూజలు

రాయవరం, మే 7(ఆంధ్రజ్యోతి): వెదురుపాక గ్రామస్తుల ఇలవేల్పు పోలేరమ్మ చిన్న సంబరాన్ని మంగళవారం అర్ధరాత్రి ఘనంగా నిర్వహించారు. అమ్మవారితో పాటు పరివార దేవతల గరగలకు స్థానిక మెయిన్ రోడ్డు పందిరి వద్ద నుంచి గ్రామంలో గ్రామోత్సం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ప్రతి ఏడాది వైశాఖమాసంలో వచ్చే పౌర్ణమి తరువాత రోజున జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఈనెల 12న పౌర్ణమి రోజున అమ్మవారి జాతర, 13న తీర్థం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

10న మెగా జాబ్‌మేళా

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే7 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ కోనసీమ జిల్లాలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈనెల 10న రామచంద్రపురంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం తెలిపారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ హోసూర్ వద్ద టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీలో సుమారు 3 వేల ఉద్యోగాలకు సంబంధించి మెగా జాబ్ మేళాలో ఎంపికలు జరుగుతాయన్నారు. 18 నుంచి 25 ఏళ్లలోపు వయస్సుగల యువతీ, యువకులు ఇంటర్, డిగ్రీ, డిప్లొమో చదివిన వారు అర్హులను తెలిపారు. శిక్షణ కాలంలో స్టైఫండ్ ఇవ్వడంతో పాటు ఉచిత రవాణా, భోజన సదుపాయం కల్పిస్తారని తెలిపారు. మంత్రి సుభాష్ టాటా యాజమాన్యంతో మాట్లాడి కోనసీమ జిల్లాలో జాబ్‌మేళా ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు.

ప్రజలకు రక్షిత మంచినీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

కొత్తపేట ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సురక్షితమైన తాగునీటి జలాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. బుధవారం వద్దిపర్రు సచివాలయం వద్ద రాజమహేంద్రవరం ఫణింద్ర స్కానింగ్ సెంటర్ వైద్యులు డాక్టర్ అప్పసాని ఫణింద్ర నాధ్ రూ.2.10లక్షలతో పునర్నిర్మించిన ఆర్వో ప్లాంటును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇందుకు సహకరించిన డాక్టర్ ఫణింద్రను ఎమ్మెల్యే అభినందించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. వద్దిపర్రు గ్రామ ప్రారంభం నుంచి చివరి వరకూ పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన వీధిలైట్లను ఎమ్మెల్యే స్విచ్చాన్ చేసి ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ జుజ్జవరపు శ్యామల ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో ఎమ్మెల్యే పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో టీఎస్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ముళ్ళపూడి భాస్కరరావు, లొల్ల సర్పంచ్ కాయల జగన్నాధం, కూటమి నాయకులు వాకలపూడి సూరిబాబు, జుజ్జవరపు హరిబాబు, వెత్సా అనిల్, తోట రజని, కూసంపూడి రామకృష్ణంరాజు, కనుమూరి రామలింగరాజు తదితరులు పాల్గొన్నారు.



కె.గంగవరం మండలం కూళ్లలో తడిసిన ధాన్యం రాశులను పరిశీలిస్తున్న దృశ్యం

అకాల వర్షం...అనుకోని నష్టం

• ధాన్యం రాశుల చుట్టూ చేరిన వర్షం నీరు
• తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల విజ్ఞప్తి

కె.గంగవరం, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి వరి రైతులు అవస్థలు పడ్డారు. ఇప్పటికే కోతలు ముగించి తేమ శాతం తగ్గించుకునేందుకు ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. బుధవారం ఉదయం ఎండగా ఉండటంతో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టారు. మధ్యాహ్నం సమయంలో అకస్మాత్తుగా వర్షం రావడంతో రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోలేక నిస్సహాయస్థితిలో వదిలేయాల్సి వచ్చింది. అకాల వర్షానికి ధాన్యం రాశుల చుట్టూ నీరు చేరింది. కూళ్లలో ధాన్యం రాశులను టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిట్టూరి సుబ్బారావు తదితరులు పరిశీలించారు.

తడిసిన ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

ఏవో బలుసు రవి

అకాల వర్షంతో తడిసిపోయిన ధాన్యం రాశులను వ్యవసాయశాఖ మండల అధికారి బలుసు రవి పరిశీలించారు. రైతులు తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు.

రాయవరం, (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో బుధవారం మధ్యాహ్నం అకాల వర్షం కురవడంతో రైతులు ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు శ్రమించాల్సి వచ్చింది. మండలంలోని పలు గ్రామాల్లో వర్షం కురవడంతో రైతులు బరకాలు కప్పి ధాన్యాన్ని కాపాడుకునేందుకు అవస్థలు పడ్డారు.

పొంగిన డ్రైన్లతో అవస్థలు

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో బుధవారం కురిసిన అకాల వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అనేక ప్రాంతాల్లో ప్రజలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. రోడ్లు, డ్రైన్లు పొంగి పొర్లడంతో పలుచోట్ల గృహాలు, రోడ్లపైకి నీరుచేరడంతో ఇబ్బందిపడ్డారు. రోడ్లు పక్కన వేసిన ధాన్యం రాశులకు నీరుచేరడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు.



రాయవరం మండలం వెదురుపాకలో ధాన్యం రాశిపై కప్పిన బరకాలు

లోతట్టు ప్రాంతాలు జలమయం

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం కురిసిన అకాల వర్షానికి పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బలమైన ఈదురులు గాలులు వల్ల అరటి, కంద, బొప్పాయి పంటలతో పాటు కోతకు వచ్చిన వరి చేలు ముంపునకు గురయ్యాయి. కౌశిక డ్రైయిన్ తూడుతో నిండిపోవడంతో ముంపునీరు పోయే మార్గం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అకాల వర్షానికి ఇటుకల బట్టీలు ముంపు బారినపడి నష్టం కలిగించాయి.

ఎడతెరిపిలేని వర్షం

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం మధ్యాహ్నం సుమారు రెండు గంటల పాటు ఎడతెరిపిలేని వర్షం కురిసింది. దీంతో కల్లాల్లో ఉన్న ధాన్యపు రాశుల వద్దకు వర్షపు వచ్చి చేరింది. ఒక్కసారిగా ఆకాశంలో మార్పులు వచ్చి వర్షం కురవడంతో కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం, పట్టుబడి పట్టిన బస్తాలు తడిచి ముద్దయ్యాయి.

రైతులపట్ల వైసీపీది కపట నాటకం

ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, మే 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉండగా రైతులను పట్టించుకోకుండా ప్రతిపక్షంలోకి రాగానే వారిపట్ల కపట నాటకం ఆడుతున్నదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు విమర్శించారు. బుధవారం వాడపాలెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ నేతలు కలెక్టరేట్ ఎదుట చేస్తున్న రిలే దీక్షలు బూటకపు దీక్షలన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల ప్రయోజనాల కోసం అదనంగా లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి ముందుకు వచ్చిందన్నారు. అవసరమైతే పరమితి పెంచి ధాన్యం కొనుగోళ్లు చేయాలని ఇటీవలే వ్యవసాయ శాఖా మంత్రి కె.అచ్చెన్నాయుడు పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరామన్నారు.



వల్లూరులో జనసేన క్రియాశీలక వాలంటీర్లకు కిట్లు అందిస్తున్న లీలాకృష్ణ

కార్యకర్తల శ్రేయస్సే జనసేన ధ్యేయం

కపిలేశ్వరపురం, మే 7(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలను ఆదుకోవాలన్న సంకల్పంతో జనసేన పార్టీ రూ.5లక్షల ప్రమాద బీమా ప్రవేశపెట్టిందని జనసేన మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని వల్లూరులో ఆయన స్వగృహం వద్ద పార్టీ నియోజకవర్గ క్రియాశీలక వాలంటీర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నాల్గవ విడతలో జనసేన క్రియాశీలక సభ్యత్వాలు నమోదు చేసిన వాలంటీర్లకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి పంపిన కిట్లను ఆయన వారికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల సంక్షేమం, యోగక్షేమాల పట్ల బాధ్యతగా ఆలోచించి అధినేత పవన్‌కల్యాణ్ తీసుకున్న నిర్ణయం అనేక మందికి కష్టసమయంలో అండగా నిలిచిందన్నారు. నియోజకవర్గంలో అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసిన మొదటి మొదటి 10 మంది వాలంటీర్లకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.